

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు






### అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

కాలం చెల్లిన చట్టాలను మార్చుకుందాం

సంక్షేమంతోనే అసమానతలు తగ్గుతాయి

గత ప్రభుత్వంలో హెలిప్యాడ్ కోసం భూమి ఇవ్వలేదని 22(ఎ)లో పెట్టేశారు

టెక్నాలజీతో అవకాశాలు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు

మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## ప్రజల జీవన ప్రమాణాలు

# మెరుగయ్యేలా పాలన

'అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందినట్టుగా భావించాలి... ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది... వాటిని నిబద్ధతతో క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాకులో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఇందులో జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలపై చర్చించారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్సులో భాగంగా అవేర్, డేటా లేక్ సహా పాలనలో ఏఐ టూల్స్ ఇతర సాంకేతికత వినియోగంలను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపై సీఎం కర్తవ్య బోధ చేశారు.

... వివరాలు లోపలి పేజీల్లో

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఆయనకు ఎయిర్‌పోర్టులో టీడీపీ ఎంపీలు స్వాగతం పలికారు. ఆ సమయంలో అక్కడ వున్న వెటరన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ వచ్చి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుగురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అవుతారు.



5

## ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి

- రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి ముందుకు వెళ్తున్నాం
- నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో అలసత్వం వద్దు
- క్షేత్రస్థాయిలో ఇంకా కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి
- ఉదాసీనత వీడండి.. పారదర్శకతే మా విధానం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

4






## పాపులను శిక్షించాల్సిందే!

### కల్తీ నెయ్యి ఘటనపై గళమెత్తిన హిందూ సంఘాలు

తిరుమల (చైతన్యరథం): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగినవన్నీ కుట్రలు, కుతంత్రాలే... తిరుమల క్షేత్రం ప్రాబల్యాన్ని తగ్గించడానికి విశ్వప్రయత్నం చేశారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపి కోట్లాది మంది హిందువుల ఆరోగ్యంతో చెలగాటం ఆడారు. నెయ్యిలో ప్రమాదకర రసాయనాలు కలిపారని 'సిట్' నివేదిక ఇచ్చిన తర్వాత కూడా వైసీపీ నేతలు నెయ్యిలో కల్తీ జరగలేదంటూ బుకాయించారు' అని స్వామీజీలు, హిందూ సంఘాలు ప్రతినిధులు గళమెత్తారు. సోమవారం వారు అలిపిరి గరుడ సర్కిల్ నిరసన తెలిపారు. వైసీపీ హయాంలో తిరుమలలో చేసిన పాపాలు ఒప్పుకోవాలంటూ నినాదాలు చేశారు. టెంకాయలు కొట్టి క్షమించు దేవుడా అంటూ వేడుకున్నారు. టీటీడీపై దుష్ప్రచారం చేసే వారిపై తక్షణం పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

4



చైతన్యరథం

# ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా పాలన

## అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

- కాలం చెల్లిన చట్టాలను మార్చుకుందాం
- సంక్షేమంతోనే అసమానతలు తగ్గుతాయి
- గత ప్రభుత్వంలో హెలిప్యాడ్ కోసం భూమి ఇవ్వలేదని 22(ఎ)లో పెట్టేశారు
- ప్రపంచంతో పోటీ పడాలంటే ప్రపంచ స్థాయి ప్రమాణాలు ఉండాల్సిందే
- టెక్నాలజీతో అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళికలు
- సమష్టి కృషితో లాభాల బాటలో విశాఖ స్టీల్‌ప్లాంట్
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి(చైతన్యరథం): 'ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నెల వారీగా సమీక్షించుకోవాలి, క్షేత్రస్థాయిలో పనుల్ని బేరీజు వేసుకోవాలి. ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ ద్వారా ప్రాజెక్టులకు ఆమోదం ఇస్తున్నాం. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇంఛార్జ్ మంత్రులు కూడా అదే వేగంతో పనులు జరిగేలా చూడాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రులు, కార్యదర్శులకు కర్తవ్య బోధ చేశారు.

"గత 19 నెలల్లో ఏపీలో చేపట్టిన కార్యక్రమాలు, టెక్నాలజీ సహా ఏఐ అప్లికేషన్ల వినియోగం ఎలా జరుగుతోందో అంచనా వేసుకోవాలి. ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి, పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నాం. ఇలా ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏ మేరకు చేరుకున్నామన్న దానిపై స్పష్టతతో ఉంటున్నాం. గడిచిన 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం. వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. తల్లికి వందనం ద్వారా రూ.10 వేల కోట్లను తల్లుల ఖాతాల్లో వేశాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మొబిలిటీ పెరిగింది. ఇప్పటిదాకా 4.29 కోట్ల మేర ఉచిత ప్రయాణాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే ఆక్యుపెన్సీ పెరిగింది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించాం. రాయలసీమలో హార్టి కల్చర్ హబ్, కోస్తాలో ఆక్వా కల్చర్ పెంచేలా చర్యలు చేపట్టాం. రైతు ఆత్మహత్యలనేవి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే... వాటిని అధ్యయనం చేసి రైతులను ఆదుకుంటున్నాం. దీపం 2.0 ద్వారా నాలుగు విడతల్లో 3.64 కోట్ల గ్యాస్ సిలిండర్లను ఇప్పటి వరకు ఇచ్చాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించాం. సంక్షేమ పథకాలు అవసరమా...? అనే చర్చ సరికాదు... పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

### వివాదాలు సృష్టించారు... 22(ఎ)లో పెట్టేశారు

"రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాం. పేదవాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా డ్రైవర్లకు మేలు చేస్తున్నాం. రూ.1,100కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా రైతులను ఆదుకుంటున్నాం. ధాన్యం కొనుగోళ్లకు కూడా రూ.10వేల కోట్ల మేర 48గంటల్లోనే చెల్లింపులు చేశాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇస్తున్నాం. తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిప్యాడ్ కోసం ఓ ప్రైవేటు భూమిని అక్రమంగా 22(ఎ)లో పెట్టేశారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఈ తరహాలో అధికారం దుర్వినియోగం చేశారు. ఇది ఒక్క తాడేపల్లిలోనే కాదు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. భూ వివాదాలు లేకుండా... పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలను అందిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటివరకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. క్వాంటం వ్యాలీకి ఇటీవలే శంకుస్థాపన చేసి అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా మారుస్తున్నాం. విశాఖలో గూగుల్‌తో పాటు ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి. మొత్తం 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు రాబోతున్నాయి. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీకి కూడా కార్యాచరణ మొదలైంది. విద్యుత్ రంగంలో ట్రూ అప్ నుంచి ట్రూడౌన్ చేసే పరిస్థితికి వచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 5757 మంది కానిస్టేబుళ్ల నియామకం కూడా పూర్తి చేశాం... వారి స్టైఫండ్ రూ.4500 నుంచి రూ.12,500కు పెంచాం. మార్చిలోగా రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

- "రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేశాం. మరో రూ.3వేల కోట్లు ఖర్చు చేసి రోడ్లను నిర్మిస్తున్నాం. పల్లె పండుగ ద్వారా రూ.4వేల కోట్లు ఖర్చు పెట్టి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. జీ రామ్ జీ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి.
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు పెడుతున్నాం. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి.
- జలజీవన్ మిషన్ పథకాన్ని గతంలో అస్తవ్యస్తం చేశారు. దాన్ని సరిదిద్ది రూ.25వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా సురక్షిత తాగునీరు ఇస్తాం.
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నాం. స్కూల్ కిట్లు పంపిణీ చేశాం.
- ఈసారి 9.88 గ్రోత్ రేట్ సాధించాం. త్వరలోనే డబుల్ డిజిట్ గ్రోత్ సాధించాలి. తలసరి ఆదాయం పెరిగేలా నిర్దిష్టమైన ప్రమాణాలను పెట్టుకున్నాం.
- సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ కేర్ నిర్వహించాలని నిర్ణయించాం. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య భీమా కల్పిస్తున్నాం.
- పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రూ.440 కోట్లతో కట్టిన డయాఫ్రమ్‌వాల్‌ను గత పాలకులు ధ్వంసం చేశారు. ఇప్పుడు దాని నిర్మాణానికి అదనంగా రూ.1000 కోట్లు ఖర్చు అవుతోంది.
- అమరావతి రాజధానిని శ్మశానం, ఎడారి అన్నారు. వచ్చే మూడేళ్లలో మోస్ట్ లివబుల్ సిటీగా మారుస్తాం.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పడింది.
- అంతా టీమ్ స్పిరిట్‌తో పని చేయాలి. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇచ్చే విధంగా ముందుకు వెళ్లాలి.
- పాలనలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు అవుట్ డేటెడ్ రావాలి.
- అవసరం లేని చట్టాలను సమీక్షించుకుని ముందుకు వెళ్దాం.
- మెరుగైన ఫలితాలు సాధించడానికి లక్ష్యాలు నిర్దేశించుకుని అంతా కలిసి పనిచేద్దాం.
- 2026-27లో అనుకున్న లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలి.









చైతన్యరథం

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు

# ముందస్తు చర్యలు తీసుకోండి




- హాస్టల్ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
- నార్మల్ డెలివరీలు పెరిగేలా అవగాహన కల్పించండి
- త్వరలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- గత పాలకుల తప్పిదాల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నాం
- క్షేత్ర స్థాయిలో పర్యటించి... పాలసీల అమలు పరిశీలించండి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): వేసవి కాలం రానున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూసుకోవడంతో పాటు పశువుల దాణాకూ సమస్యలు రాకూడదన్నారు. మరోవైపు ప్రజా సమస్యలు-పాలనా తీరు తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్రస్థాయిలో ఎలా ఉందనే దానిని ప్రత్యక్షంగా చూడాలన్నారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా... క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్ధవంతంగా అమలు కానప్పుడు ఆశించిన ఫలితాలు రావని సీఎం అభిప్రాయ పడ్డారు. వివిధ వర్గాల ప్రజలతో అధికారులు తరుచూ మాట్లాడుతూ ఉంటే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు.

సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. పలు అంశాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. "ప్రతి ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకోవాలి. పీ4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి. వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. ఆ జిల్లాలు భవిష్యత్తులో మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు కశ్మీర్లో మాత్రమే కుంకుమ పువ్వు ఉత్పత్తి జరుగుతోంది. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుంది. కాఫీ సాగు పెంచడంతో పాటు అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాం.. ఇది మరింతగా పెరగాలి."

### జూలైకల్లా 66లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్

"సంజీవని ద్వారా జూలై 2026 నాటికి 66లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5లక్షల మంది హాస్టల్ విద్యార్థుల స్క్రీనింగ్ చేపట్టాలి. 12వ తరగతి వరకు ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, ఎదుగుదలను నమోదుచేయాలి. పౌష్టికాహారం అందించడంతో సహా అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. అవిశ, మునగ, రకరకాల ఆకు కూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. వాటిని ఆహారంగా తీసుకోవడం మానేయడం వల్లే సమస్యలు వస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాలు, అన్న క్యాంటీన్లలో కూడా పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక గర్భిణిల విషయంలో నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి... సిజేరియన్లు తగ్గాలి. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జనాభా విషయానికొస్తే చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య బాగా పెరిగిపోయింది. యూరోప్‌లోని దాదాపు 20 దేశాల్లో ఈ సమస్య ఉంది. అక్కడ సామాజిక వేడుకలే లేవు." అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఒత్తిడి లేని విద్యా బోధనే లక్ష్యంగా...

"పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలి. పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేని విధంగా ఈ కార్యాచరణ ఉండాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలు వస్తాయి. సరికొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. సామాజిక బాధ్యత కింద ప్రైవేటు సంస్థలు యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంపై దృష్టి పెట్టాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్‌తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్నీ పర్యవేక్షించాలి.

రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల దగ్గర నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి. చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. దీంతో పాటు డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లను తవ్వాలి, నిల్వలు పెరిగేలా చూడాలి ప్రస్తుతం 7.34 భూగర్భజలాలు ఉన్నాయి. నీటి బ్యాంకు తరహాలో భూగర్భ జలాల వినియోగం జరగాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలం." అని సీఎం వివరించారు.

### జీ రామ్ జీ పనులకు కార్యాచరణ సిద్ధం చేయాలి

"పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీటి కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇకపై ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయతీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణ చర్యలు, గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రైన్లు చేపట్టాలి." అని సీఎం దిశానిర్దేశం చేశారు.



టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర సోమవారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించారు.

## ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి



- రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి ముందుకు వెళ్తున్నాం
- నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో అలసత్వం వద్దు
- క్షేత్రస్థాయిలో ఇంకా కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి
- ఉదాసీనత వీడండి.. పారదర్శకతే మా విధానం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

అమరావతి (చైతన్యరథం): 'కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన, అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు నిబద్ధతతో పనిచేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అనుభవం మార్గదర్శకాలుగా ముందుకు వెళ్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉంది. నాలుగు గోడల మధ్య మంత్రులు, ఉన్నతాధికారులు తీసుకునే ప్రజోపయోగ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అర్థవంతంగా అందాలంటే అంతా సమష్టిగా పని చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచించారు.

సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజీపడటం లేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయి విలువైనదే. పెట్టే ఖర్చు, దానివల్ల అందే ప్రయోజనం ప్రజలకు ఉపయోగపడేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి.

### రూ.వేల కోట్ల పనులను మొదలుపెట్టాం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన మీద దృష్టిపెట్టాం. ఇందులో భాగంగా మొదటి విడత 'పల్లె పండుగ' కింద రూ.2,500 కోట్లు, 'పల్లె పండుగ' 2.0 కింద రూ.5,700 కోట్లు ఖర్చు చేశాం. గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపర్చే 'అడవి తల్లి బాట' పథకం కింద రూ.1,005 కోట్లు వెచ్చించాం. దీంతో పాటు సాస్కి నిధులు రూ.2,123 కోట్లతో నియోజకవర్గాల్లో ప్రాధాన్యతను బట్టి పనులు చేస్తున్నాం. మొత్తంగా రూ.11,328 కోట్లతో చేస్తున్న పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జలజీవన్ మిషన్ పథకం కింద రూ.28వేల కోట్ల పనులకు అనుమతులు లభిస్తే, దానిలో రూ.10వేల కోట్ల పనులను ప్రారంభించాం. ఇక అటవీ శాఖ పరిధిలో రూ.200 కోట్లతో నగరవనాలను ఏర్పాటుచేస్తున్నాం. ఇంకా అనేక పనులను పారదర్శకంగా క్రమపద్ధతిలో, ప్రాధాన్యతలను అనసరించి చేస్తున్నాం.

### నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలి

అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులతో పనులను క్రమపద్ధతిలో చేస్తున్నాం. మొదలుపెట్టిన పనులను ఓ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి. నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయడం అవసరం. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం అప్పగించిన పనిని నిబద్ధతతో నిజాయతీగా పూర్తి చేయండి.

ప్రభుత్వ నిర్ణయాల అమలు, పనులు జరుగుతున్న తీరు విషయంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే కొన్నిలోపాలు కనిపిస్తున్నాయి. దీనిని అధిగమించాలి. ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి పనుల పూర్తి విషయంలో దిశానిర్దేశం చేయాలి. నిర్ణయాలను అమలు చేసే బృహత్తర బాధ్యతలు క్షేత్రస్థాయి సిబ్బంది మీదనే ఉన్నాయి. దాన్ని సరైన రీతితో నిర్వర్తించండి. ప్రభుత్వం మీకు తగిన విధంగా సహకరిస్తుంది" అన్నారు.

చైతన్యరథం

# విద్యుత్ చార్జీల భారం పడనివ్వం...

# ప్రజలకే ట్రూ డౌన్ ఫలితాలు




- ఆర్టీసీలో వెయ్యి ఈవీ బస్సుల కొనుగోలు
- కీలక శాఖల్లో నిబంధనల సరళతరంపై దృష్టి పెట్టండి
- పన్నుల వసూళ్లు తగ్గకూడదు, వ్యాపారులను వేధించకూడదు
- కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

అమరావతి (చైతన్యరథం): ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా చూస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి స్పష్టం చేశారు. ట్రూ డౌన్ ఫలితాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు భారాన్ని కూడా తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయంలో ఏఐ సాంకేతికత, విద్యుత్, విత్తన నిర్వహణ, డ్రోన్లు, యాంత్రీకరణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పాలసీలు, పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...“వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, మెరుగైన ధరలు లభించేందుకు ఉన్న అవకాశాలపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉండాలి. గ్లోబల్ మార్కెట్ ఉండే పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. రాయలసీమను ఉద్యాన రంగంలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు ప్రైవేటు పెట్టుబడులపైనా దృష్టి పెట్టాలి. ప్రస్తుతం రాయలసీమ నుంచే 220 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. త్వరలోనే 400 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు నాలుగు లైన్ల రైల్వే లైన్ వస్తోంది... స్పీడ్ ట్రైన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే సాకారమవుతుంది. నెట్ జీరో ఎమిషన్ కాన్సెప్టుతో విద్యుత్ ఉత్పాదన జరగాలి. పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులు వేగంగా చేపట్టాలి. రూ.3.90కే విద్యుత్ కొనుగోలు ధర తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్టీసీలో కనీసం వెయ్యి బస్సులను ఈవీగా మార్చాల్సిన అవసరం ఉంది. కుప్పంలో ఇటీవల ఓ ఐదువేల సైకిలుకు ఇ-సైకిళ్ల పంపిణీ చేశాం. ఈ తరహా విధానాలతో వేగంగా ట్రాన్సిషన్ జరుగుతుంది. గతంలో ఏపీలో నీరు, విద్యుత్ విషయంలో లోటు ఉండేది. ఇప్పుడు మిగులు పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక మీటరు వరకు భూగర్భ జలాలను పెంచటం ద్వారా దాదాపు రూ.4వేల కోట్లు ఆదా అవుతుంది.” అని సీఎం వెల్లడించారు.

### నిబంధనలు తగ్గాలి... పాలన సులభం కావాలి

“చిన్న రైస్‌మిల్లు పెట్టడానికే 30కి పైగా అనుమతులు కావాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి పోవాలి. చిన్నపాటి వ్యాపారం ప్రారంభించడానికి 30చోట్లకు తిరగడం కష్టసాధ్యమైన అంశం. మరోవైపు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతున్నాం. వివిధ కీలక శాఖల్లో నిబంధనలను సరళతరం చేయాలి. అగ్నిమాపక, పురపాలక, అటవీ, స్కూల్ ఎడ్యుకేషన్... ఇలా వేర్వేరు శాఖల్లో నిబంధనలను మరింత సడలించాలి. నిర్దేశిత కాలపరిమితి ముగిసిన తర్వాత చట్టాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కరణల్లో ముందుండాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఎలాంటి ఆటంకమూ రాకూడదు. శాండ్, మైన్ తదితర అంశాల్లో నిబంధనలు సులభంగా ఉండాలి. సింగిల్ విండో విధానం అనుసరించాలి. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ కూడా రానీయకుండా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధికారుల నుంచి ఇబ్బందులు వస్తున్నాయనే ఫిర్యాదులు ఇంకా వస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మెటీరియల్ సరఫరాకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలను అందుబాటులోకి తేవాలి. వీటి గురించి చాలా కాలంగా మాట్లాడుతున్నాం. దేవదాయ వంటి శాఖలు ఇంకా గాడిలో పడాల్సి ఉంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా పనులు పూర్తి చేసుకోగలిగేలా చేయడమే సుపరిపాలన. ఆ దిశగా అందరూ కృషి చేయాలి. అందరూ భాగస్వాములు కావాలి.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### కేంద్ర నిధులు మురిగిపోతే అధికారులనే బాధ్యులుగా చేస్తాం

“ప్రొడక్ట్ పర్ఫెక్షన్‌పై దృష్టి పెట్టాలి. నాణ్యమైన ఉత్పత్తులు వస్తేనే ఎక్కువ మార్కెట్ సాధ్యం అవుతుంది. స్వయం సహాయ సంఘాలకు కూడా ‘స్వయం’ అనే పేరిట బ్రాండ్ రూపొందించాం. ఈ బ్రాండ్ ద్వారా వారు తయారుచేసిన ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండింగ్ రావాలి. ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండ్ ఇమేజ్ ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. నగర ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణం కోసం అవసరమైన మేరకు భూసేకరణ చేపట్టాలి. దీనికి అవసరమైన నిధులను పీసీబీ సమకూరుస్తుంది. రూ.300 కోట్ల వ్యయంతో ఎస్టీపీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో లెగసీ వేస్ట్‌ను వేగంగా క్లియర్ చేయాలి. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంగా ప్రణాళికలు చేయాలి. ఉగాది నుంచి పాఠశాలల్లో గ్రీన్ కవర్ కోసం దేశీయ వృక్ష జాతుల పెంపకంపై కార్యాచరణ రూపొందించాలి.

గ్రీన్ కవర్ పెంచే విషయంలో విద్యార్థులను భాగస్వాములు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. తీర ప్రాంతంలో కోత నివారణకు ఉప ముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టు అభినందనీయం. తీర ప్రాంతంలో ఆర్కిడ్స్ సాగు ద్వారా రైతులకు ఆదాయం, కోత నివారణ సాధ్యం అవుతుంది. పన్నులను పూర్తిస్థాయిలో వసూలు చేయాలి. అలాగని వ్యాపారులను వేధించి వసూలు చేయవద్దు. రాష్ట్ర ఖజానాకు నష్టం రాకూడదు. రిజిస్ట్రేషన్ విభాగంలో ఈ ఏడాది రూ.9,103 కోట్లతో 27 శాతం మేర వృద్ధి నమోదైంది. ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, పురపాలక శాఖ ఇలా విభాగాలు అన్నీ సమర్థంగా పని చేయాలి. అటవీ శాఖ దగ్గర ఉన్న ఎర్రచందనం విక్రయించి ఆదాయం ఆర్జించాల్సిన అవసరం ఉంది. ఎర్రచందనం విక్రయం ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా వేశాం. ప్రభుత్వ శాఖలన్నీ కేంద్ర పథకాల ద్వారా వచ్చిన నిధుల్ని తక్షణం ఖర్చు చేయాలి. అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల విషయంలో కలెక్టర్లు తక్షణం కేవైసీ చేపట్టాలి. 1,04,727 పీడీ ఖాతాల్లో ఉన్న అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.148 కోట్లుగా ఉన్నాయి. వీటిని కలెక్టర్లు వినియోగించుకోవచ్చు. 1,04,727 పీడీ ఖాతాలకు కేవైసీ సమర్పించాల్సి ఉండగా... రూ.34 కోట్ల అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లకు చెందిన కేవలం 7,742 ఖాతాలకు మాత్రమే కలెక్టర్లు కేవైసీ చేయించారు. సంస్కరణల ప్రాతిపదికన సాస్కి కింద ప్రాజెక్టుల నిధులు త్వరితగతిన వచ్చేలా చూడాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.26,021 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశాం.” అని ముఖ్యమంత్రి వెల్లడించారు. సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా హాజరయ్యారు.






## కల్తీ నెయ్యి వ్యవహారంలో

# దోషులను కఠినంగా శిక్షించాలి

### గళమెత్తిన హిందూ ధార్మిక సంఘాలు, స్వామీజీలు

తిరుమల (చైతన్యరథం): పవిత్రమైన శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపిన వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలని స్వామీజీలు, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు అలిపిరి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం పాపం కాదు మహా పాపం అన్నారు. గత ఐదేళ్లలో తిరుమలలో జరిగిన కుట్రలు, కుతంత్రాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల ప్రాబల్యం తగ్గించడానికి గత వైసీపీ ప్రభుత్వం శత విధాలా ప్రయత్నించిందన్నారు. సాధు సంతుల సమన్వయకర్త అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని ఉద్దేశపూర్వకంగా కల్తీ చేసిన వైసీపీని ఏడుకొండలస్వామి భక్తులు, ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై దుష్ప్రచారం చేసే వారిపై తక్షణమే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై త్వరలోనే రాష్ట్రపతిని కలుస్తామన్నారు. తిరుమల క్షేత్రంపై జరిగిన కుట్రలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తిరుమలపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలన్నారు. వైసీపీ నేతలు వెంకటేశ్వరస్వామికి, శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో తిరుమలలో చేసిన పాపాలు ఒప్పుకోవాలంటూ నినాదాలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి క్షమించు దేవుడా అని వేడుకున్నారు. కార్యక్రమంలో సాధు సంతువుల సమన్వయకర్త అట్లూరి నారాయణ రావు, శివ కామేశ్వరి పీఠం శివానందస్వామి, తుమ్మ ఓంకార, రాజేశ్వరనందస్వామి, కాల భైరవేశ్వరస్వామి, నీలకంఠ, అంజలి మాతాజీ, ఓం శ్రీ మాతాజీ తదితరులు పాల్గొన్నారు.



# ఏడున్నర గంటలు ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష

- శాంతి భద్రతలపై డీజీపీ, ఎస్పీలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అందులోని ముఖ్యాంశాలు...
- రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాలి.
- రోడ్డుప్రమాదాలు తగ్గేందుకు హోం,ఆర్అండ్‌బీ శాఖలు కార్యాచరణ చేపట్టాలి.
- తీవ్ర నేరాల కట్టడి విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగైన పనితీరు కనబర్చాలి.
- ఇకపై శాంతిభద్రతల విషయంపై ప్రతినెలా సమీక్షిస్తా.
- పోలీసింగ్‌లో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలి.
- గంజాయి సాగు ఉండేందుకు వీల్లేదు.
- డీ-అడిక్షన్ సెంటర్లతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ద్వారా మద్యం, డ్రగ్స్‌కు బానిసలైన వారిని మార్చేలా చర్యలు తీసుకోండి.
- పోలీసింగ్‌లో సక్సెస్ స్టోరీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి... గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించిన వారంతా కంట్రోల్ అయ్యారు.
- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హనానికి పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం.
- 16 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నియంత్రించేలా ఓ కార్యాచరణ రూపొందిస్తున్నాం.
- కుటుంబ వివాదాల వల్లే ఎక్కువ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. బాధితులకు కౌన్సిలింగ్ ఇప్పించే వ్యవస్థను తీర్చిదిద్దాలి.





కేంద్ర మంత్రులను కలవడానికి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి పార్టీ ఎంపిలు ఎయిర్ పోర్టులో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపిలతో ఎయిర్ పోర్టు లాంజ్‌లో సిఎం కొద్ది సేపు సమావేశం అయ్యారు. చంద్రబాబు నాయుడు ఎయిర్ పోర్టులో ఉన్న విషయాన్ని తెలుసుకున్న వెటరన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి 1 జన్ పథ్‌లోని తన నివాసానికి వెళ్లారు.







# ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజాపై ఆందోళన వద్దు

- పూర్తిగా నియంత్రణలోకి తీసుకొస్తున్నాం
- పరీక్షల కోసం భోపాల్‌కు నమూనాలు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా సోడ మ్ మండలం అమ్మగారిపల్లి, పుట్టవారిపల్లి గ్రామాల్లో గుర్తించిన ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (పక్షి ఫ్లూ) కేసులపై ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. NIHSAD, భోపాల్ ప్రయోగశాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా భారత ప్రభుత్వ పశు సంవర్ధక/డెయిరీయింగ్ శాఖ (DAHD) ద్వారా ఫిబ్రవరి 8న వ్యాధి నిర్ధారణ జరిగినట్లు ఆయన వెల్లడించారు. నిర్ధారణ వెలువడిన వెంటనే ప్రభావిత ప్రాంతాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను మోహరించి నిర్ణీత ప్రామాణిక కార్యాచరణ విధానాల ప్రకారం కట్టుదిట్టమైన కల్లింగ్ (తొలగింపు) చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రక్రియ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పశుసంవర్ధక, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ ల సమన్వయంతో సమర్థవంతంగా కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రభావి త ప్రాంతాల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా పర్యవేక్షణను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కర్వేటి నగరం మండలంలో పక్షుల అకస్మాత్తు మరణాల సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో పశువైద్య బృందాలు పరిశీలనలు నిర్వహించి నమూనాలను పరీక్షల కోసం NIHSAD, భోపాల్‌కు పంపినట్లు చెప్పారు.

సంబంధిత రైతులకు అవసరమైన బయో సెక్యూరిటీ, ముందస్తు జాగ్రత్త చర్యలపై స్పష్టమైన సూచనలు అందించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆదివారం రెండు పొలాలలో కల్లింగ్ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లో భారత ప్రభుత్వం ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగినట్లు వెల్లడించారు. సోడమ్ మండలం నుంచి ఒకటి, కర్వేటినగరం మండలం నుంచి మరో ఒకటి చొప్పున మొత్తం రెండు అదనపు నమూనాలను పరీక్షల కోసం NIHSAD, భోపాల్ ప్రయోగ శాలకు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా నమూనాల పరీక్షా ఫలితాల కోసం అధికారులు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు ఆదివారం కర్వేటినగరం ప్రాంతంలోని పొలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి స్పష్టమైన మార్గనిర్దేశనం చేశారని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి భయం లేదా అపోహలకు లోనవ్వాల్సిన అవస రం లేదని భరోసా ఇచ్చారు. ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా అనేది పక్షులకు మాత్రమే సంబంధించిన వ్యాధి అని, సరైన విధంగా వండిన కోడి మాంసం, గుడ్ల వినియోగం పూర్తిగా సురక్షితమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అవసరమైన అన్ని నివారణ, నియం త్రణ చర్యలను పటిష్టంగా అమలు చేస్తోందని తెలిపారు. కోడి పెంపకదారులు బయోసెక్యూరిటీ చర్యలను కఠినంగా పాటించా లని, పక్షుల్లో ఏవైనా అసాధారణ మరణాలు గమనించిన వెంటనే సమీప పశువైద్య అధికారులకు తక్షణమే సమాచారం అందించా లని సూచించారు. వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించేందుకు కోడి పెంపకదారులు, సాధారణ ప్రజలు పశుసంవర్ధక శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

**పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తాం : కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



రామచంద్రపురం(చైతన్యరథం): కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. భవన నిర్మాణ సమైక్య నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను వేగంగా కార్యాచరణలోకి తీసుకురావాలని భవన నిర్మాణ సమైక్య నాయకులు మంత్రికి వినతిపత్రం అందించారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో అవకాశం కల్పించినట్టుగానే, ఇసుక రీచ్‌లలో భవన నిర్మాణ కార్మికులకు కూడా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ల సంఖ్యను పెంచి కార్మికులకే బోర్డు డైరెక్టర్ హోదా కల్పించాలని కోరారు. ప్రభుత్వం వామపక్ష నాయకులతో కాకుండా నేరుగా భవన నిర్మాణ కార్మికులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. అన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన నిర్మాణ సమైక్య నాయకులు ఎం.శివకుమార్ గౌడ్, అప్పారి శ్రీనివాస్, గారా సత్యసాయితో పాటు సంఘ నాయకులు, కార్మికులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్న కూటమి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉంటామని తెలిపారు. అనంతరం సమాఖ్య ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు.

# మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

- నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ
- మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఫరూక్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్‌ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి మంచి ర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుం దని వివరించారు. నీట్, ఈఏపీ సెట్‌ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాప కుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్‌సైట్: www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీ ఎం కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే cedmap 2017@gmail.com, ఫోన్ నెంబర్: 0866-2970567, మొబైల్ నెంబర్:73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

# విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు

**- మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం**

**- నిడదవోలు ఘటనపై స్పందన**



నిడదవోలు (చైతన్యరథం): నిడదవోలులో సోమవారం సాయం త్రం చోటుచేసుకున్న ప్రైవేట్ కాలేజీ బస్సు ప్రమాదంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కాలేజీకి చెందిన బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడం వల్ల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనపై అధికారులతో మాట్లాడారు. బస్సులో ఉన్న విద్యార్థులం దరూ సురక్షితంగా ఉన్నారని ధృవీకరించుకున్నారు. స్వల్ప గాయా లైన క్లీనర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదం కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను తక్షణమే పున రుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల కు ఇబ్బంది కలగకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయా లని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల బస్సుల కండిషన్‌పై సీరియస్ అయ్యారు. ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు తక్షణమే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించా రు. నిబంధనలు అతిక్రమించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించా రు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్ర త్తలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థలు తమ వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే పరిణామాలు తీవ్రం గా ఉంటాయని తెలిపారు.



# తెలుగుయువత ఉపాధ్యక్షుడు తమ్మినేని మృతి

**- టీడీపీ కార్యాలయంలో ఘన నివాళి**

మంగళగిరి (చైతన్యరథం): విశాఖలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్ మృతి చెందడం పట్ల తెలుగుదేశం పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు బండారు వంశీకృష్ణ, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంత రం తమ్మినేని మోహన్ అకాల మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఒక చురుకైన యువ నాయకుడిని కోల్పోయిందని వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ

- **తిరుమల లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు**
- **రాజకీయాలకతీతంగా మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ నిర్వహించాలి**
- **పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్**



తెనాలి(చైతన్యరథం): పవిత్రమైన తిరుమల లడ్డు వ్యవహారాన్ని రాజకీయ కక్ష సాధింపుగా మలిచే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన మీడియాతో మాటాడారు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదు..కోట్లాది భక్తుల మనోభావాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశం. తిరుమల లడ్డు విషయంలో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో సీబీఐ నివేదిక స్పష్టమైన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి నప్పటికీ వైసీపీ నాయకులు ఎదురు దాడి ధోరణితో మాట్లాడ టం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 లక్షల లీటర్లుగా చెప్పబడిన నెయ్యిలో ఒక్క చుక్క అసలు నెయ్యి కూడా లేదని నివేదిక స్పష్టం చేసిన తరువాత కూడా మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదని హితవుపలికారు. అయోధ్యకు పంపిన లడ్డూల విషయంలో "ప్రత్యేక నెయ్యి వాడాం" అని వైసీపీ నాయకులు చెబుతున్న మాటలే.. తిరుమలలో వాడుతున్న నెయ్యి అసలు నెయ్యి కాదన్న విషయం వారికి ముందే తెలుసన్న దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. నిజంగా అయోధ్యకు పంపిన లడ్డూల కోసం ప్రత్యేకంగా నెయ్యిని తెప్పించారంటే, మిగిలిన లడ్డూల తయారీలో వాడిన పదార్థాల విషయంలో ఐదే ళ్లుగా ప్రజలను ఎలా మోసం చేశారో వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఒక డైరీ సంస్థ నుంచి 1005 కిలోలు, పలమనేరులోని మరో సంస్థ నుంచి మరో 1005 కిలోల నెయ్యిని ప్రత్యేకంగా తెప్పించి అయోధ్య లడ్డూల కోసం వాడామని చెప్పడం అత్యంత బాధాకరమని అన్నారు. తిరుమల లడ్డు అన్నీ తిరుమలలోనే తయార వుతా యని, వేర్వేరు ప్రాంతాల నుంచి వేర్వేరు పదార్థాలు పంపించి లడ్డులు తయారు చేయడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత దాడులుగా మలిచే ప్రయత్నాలను సమాజం గమనించి ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ అంశాన్ని రాజకీయాలకతీతంగా తీసుకుని మఠాధిపతులు, పీఠాధిప తులు, ధార్మిక పెద్దలు, సమాజంలోని బాధ్యతగల వ్యక్తులు అందరూ కలిసి ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి భక్తుల మనోభావాలకు క్షమాపణ చెప్పాల్సిన వారు ప్రెస్ మీట్లు పెట్టి ఎదురు దాడి చేయడం పైశా చిక ఆనందంగా మారిందని విమర్శించారు. ధర్మాన్ని కాపాడటం అంటే ద్వేషం కాదు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మ రక్షణ. ఈ అంశంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలని కోరారు.

# రామచంద్రపురం నియోజకవర్గానికి 11వ ర్యాంక్

**- మంత్రి సుభాష్‌కు అభినందనల వెల్లువ**

రామచంద్రపురం (చైతన్యరథం): మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 175 నియోజకవర్గాలకు 108 కీలక ఇండికేటర్లను పరిగణలోకి తీసుకుని మార్కులు కేటాయించి ర్యాంకులు ప్రకటించింది. నియోజకవర్గం 91 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంక్ సాధించింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ సమర్థవంతమైన పాలన, అభివృద్ధి దృష్టి కోణానికి ఇది స్పష్టమైన నిదర్శనం. మొత్తం 175 నియోజకవర్గాల్లో ఏ ప్లస్ గ్రేడ్‌లో 21 నియోజకవర్గాలు, ఏ గ్రేడ్‌లో 153 నియోజక వర్గాలు, బి గ్రేడ్‌లో కేవలం ఒక నియోజకవర్గం మాత్రమే ఉండటం విశేషం. 93 మార్కులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ప్రథమ స్థానం లో నిలిచింది. రామచంద్రపురం 11వ ర్యాంకు సాధించడంపై నియోజకవర్గ ప్రజలు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. దీనిపై స్పందించిన మంత్రి సుభాష్ "ఇది ప్రజల ఆశీర్వాదం, అధికారుల సమ న్వయం, ప్రభుత్వ విధానాల సమర్థ అమలుకు వచ్చిన ఫలితం. భవిష్యత్తులో ఇంకా కష్టపడి పనిచేసి రామచంద్రపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మరింత ముందంజలో నిలిపేందుకు కృషిచేస్తామని తెలిపారు.




# వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వేలో అక్రమాలు

**- ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదు**

**- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్సీ ఆలపాటి**

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ సోమవారం ప్రజావినతుల కార్యక్ర మంలో అర్జీలు స్వీకరించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెంది న రవికుమార్ తన సమస్యను వివరిస్తూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ బలాన్ని వాడుకుని తమ ఇంటి, పొలం, హౌస్ ట్యాక్స్‌ను అన్యాయంగా తమ తండ్రి అగ్గిరాముడు పేరుతో రిజిస్టర్ చేయించుకున్నాడు. జగనన్న సంపూర్ణ గృహ చట్టం కింద కూడా పట్టాను తన పేరుకు మినహాయించకుండా తన పేరిట రిజిస్టర్ చేసుకున్నాడు. పొలం రీ సర్వే చేయించి ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్‌లో కూడా అతని పేరుతో నమోదు చేయబడి ఉంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగ లేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**భూమి విస్తీర్ణాన్ని తగ్గించారు**

మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం పాపాయిపల్లి గ్రామానికి చెందిన హేమంత్‌రావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ కుటుంబానికి సంబంధించిన భూమి సర్వే నంబరు 140/1లో మొత్తం 50 సెంట్ల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ భూమి తమ స్వంతంగా చట్టబద్ధంగా అనుభవంలో ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎటువంటి నోటీసు లేకుండా తమ అంగీకారం లేకుండానే తమ భూమి విస్తీర్ణాన్ని 50 సెంట్ల నుంచి 40 సెంట్లకు తగ్గించారు. అంతేకాకుండా తమ ఆధార్ నంబరు, కులం వివరా లను కూడా తప్పుగా నమోదు చేశారు. దీనిపై పలుమార్లు అధికా రులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**వీఆర్వో తప్పుడు నివేదిక**

పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన రమాదేవి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. చామర్రు గ్రామంలోని సర్వే నంబర్ 660లో 1.50 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించి 2006 నాటి పట్టా (16/2006/ఏ), పాస్ పుస్తకాలు, సర్వే సర్టిఫికెట్లు అన్నీ ఉన్నాయి. కానీ ఆన్‌లైన్ చేసే సమయంలో అధికారులు సంబంధం లేని సర్వే నంబర్ 559ను రికార్డుల్లో ఎక్కించారు. ఈ తప్పును సరిదిద్దమని అనేకసార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరి గినా ఫలితం లేకపోయింది. పైగా క్షేత్రస్థాయిలో సాగులో ఉన్నప్పటికీ "స్వాధీనంలో లేరు" అని వీఆర్వో తప్పుడు నివేదిక ఇచ్చారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్క రించాలని కోరారు.



**అక్రమంగా సర్వే నెంబర్లు మార్చే యత్నం**

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం నీరుగట్టుపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. కలకడ మండ లం ఎనుగొండపాలెం గ్రామంలో అక్కడ సర్వే నెం.964/1 (964/1ఏ)లో ఎ.4.94 సెంట్ల భూమి తమ తండ్రి పేరిట 22-02-1989న డీ-పట్టాగా మంజూరు అయింది. నెం.4 రిజిస్టర్, పాసు పుస్తకం, బ్యాంక్ రుణం వంటి అన్ని చట్టబద్ధ రికార్డులు తమ వద్ద ఉన్నాయి. ఇటీవల రెవెన్యూ అధికారులు అక్రమంగా తమ భూమి సర్వే నెంబరును 1017, 1018, 1019గా మార్చి, మూడే ఆనందనాయక్, మూడే ప్రసాద్‌నాయక్ పేర్లపై నకిలీ 1-బీలు, అడంగల్, మ్యుటేషన్‌లు, కొత్త స్కెచ్‌లు తయారు చేయించి తమ భూమిని వారికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కౌలతలకు చలానా కడితే కూడా తిరస్కరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**ఇతరుల పేరుపైకి భూమి ఆన్‌లైన్ చేశారు**

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం ఎల్‌బీ చర్ల గ్రామా నికి చెందిన పద్మావతి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తమకు కొంత భూమి ఉంది. అయితే గ్రామానికి చెంది న వీఆర్‌ఏ కుమారుడైన అడబాల రామకృష్ణ కుటుంబసభ్యుల పేర్లను ఎటువంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోయినా రెవెన్యూ అధికారులు అక్రమంగా ఆన్‌లైన్ చేశారు. తమకు 1994 నుంచి పాస్ పుస్తకాలు, పన్ను రశీదులు ఉన్నప్పటికీ అధికారులు "రికార్డు లు కనిపించడం లేదు" అంటూ చెబుతున్నారు. గత 34 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్న తమకు ఆన్‌లైన్ పట్టా ఇవ్వకుండా 15 ఏళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నా రు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**అక్రమంగా ఇళ్ల ప్లాట్లను తీసుకున్నారు**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన వెంకట నాగేశ్వరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. మంగళగిరిలో సర్వే. 134 లోని అభినందన లేఅవుట్ (ఎల్‌పీ నెంబర్: 17/18)లో ప్లాట్ నెంబర్లు 288, 289లను 10-02-2006న సబ్ రిజిస్ట్రార్ కార్యా లయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే జరిపి తమ సొంత ప్లాట్లను పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాల కోసం సబ్ డివిజన్ చేసి ప్లాన్ తయారు చేశారు. పక్కాగా రిజిస్ట్రేషన్ డాక్యు మెంట్లు ఉన్న తమ స్థలాలను ఇళ్ల పట్టాల పేరుతో తీసుకోవడం చట్టవిరుద్ధం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించా లని కోరాడు.

**భూ సమస్యలను పరిష్కరించండి**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 248/13లో 2.00 ఎకరాల భూమి ఉండగా రీ సర్వే అనంతరం అది 1.96 సెంట్లు మాత్రమే ఉంది. సర్వే జరిపి తనకు తగ్గిన 4 సెంట్ల భూమిని ఇప్పించి తన కుమార్తెలకు న్యాయం చేయాలని కోరాడు.

పల్నాడు జిల్లా గురజాలకు చెందిన మాధవరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలో తమకు సర్వే నంబర్ 1095లోని 4.18 ఎకరాల భూమి ఉంది. సంబంధం లేని వ్యక్తుల పేర్లపై ఆన్‌లైన్ చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# అనారోగ్య బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కులు



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గం, గరుగుబిల్లి గ్రామానికి చెందిన సొంటి నాగలక్ష్మి అనారోగ్యానికి గురైన విషయం కురుపాం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో, ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి రూ.48,376 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు అనారోగ్యం వంటి అపత్కాల పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం తమ బాధ్యత అని తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉన్న సహాయాన్ని చేరవేసేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, ఎంపీటీసీ సింహాచలం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఈ.ఎస్.ఐ హాస్పిటల్‌ను పరిశీలించిన ప్రభుత్వ విప్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): నగరంలోని సింధియా న్యూ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఈ.ఎస్.ఐ హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు సోమవారం పరిశీలించారు. హాస్పిటల్ పరిశుభ్రతను పరిశీలించి సందర్శకులను సమస్యలపై ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ నందు వ్యర్థాల విభజన విధానాన్ని పరిశీలించి, వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను మరియు ఓపి పేషెంట్స్‌ను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం హాస్పిటల్ అభివృద్ధి మరియు పనితీరుపై సమీక్షించారు. ప్రాణాంతక క్యాన్సర్ బారినపడి ఖరీదైన వైద్యం చేయించుకోలేక దినదిన గండంగా బతుకీడుస్తున్న పేదల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 & 2 లక్షల ఖరీదు చేసే ఇంజక్షన్స్ సుమారు 96 పేషెంట్లకు 2.9 కోట్ల విలువగల ఇంజక్షన్లు ఉచితంగా ఈ కూటమి ప్రభుత్వంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ సూపరింటెండెంట్ ఫణీంద్ర, ఆర్.ఎం.వో శ్రీధర్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అసభ్య కార్యక్రమాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు




కురుపాం (చైతన్యరథం): విద్యాబుద్ధులు, నైతిక విలువలు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు అసభ్య కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల పరిధిలోని రహదారులు, తాగునీరు, మౌలిక వసతుల సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బి. అన్నాజీరావు, మండలశాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# తీర ప్రాంత భద్రతపై సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ

మోపిదేవి (చైతన్యరథం): ఉగ్రవాదులు సముద్ర మార్గం గుండా దేశంలోకి చొరబడకుండా కట్టడి చేయడమే లక్ష్యంగా సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ మచిలీపట్నం చేరుకుంది. పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సోమవారం చీరాలకు బయలుదేరింది. ఈ సందర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

# ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలకు 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ



విజయవాడ (చైతన్యరథం): ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానంపై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 40 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు వెళ్లిన వీరికి ఫిబ్రవరి 9నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజులు పాటు హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానంపై శిక్షణ వుంటుంది. ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్, సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు శిక్షణ తీసుకునే 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ముందుగా హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు. మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీలో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో బేసిక్స్ ఆఫ్ హ్యాండ్ మేడ్ పేపర్ టెక్నాలజీ, కావాల్సిన ముడి పదార్థాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయజేశారు.

# ప్రజలపై ప్రతీకార యాత్రలో జగన్ : దాసరి శ్యామ్ చంద్రశేషు



ఢిల్లీ / చింతలపూడి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన ఐదు సంవత్సరాల పాలనలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్ అన్నింటిలో అవినీతి చేసి అది సరిపోలేదని ఆఖరికి కోట్లాది మంది భక్తులు ఎంతో భక్తితో కొలిచే కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదంలో కూడా కెమికల్స్ వాడి లడ్డు తయారుచేయడం క్షమించరాని నేరమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఒక్క పాల చుక్క కూడా లేకుండా నెయ్యి కెమికల్స్‌తో తయారుచేసి లడ్డు తయారీలో వాడటం అత్యంత దారుణం అని, దీనిపై దేశ ప్రజలకు, వెంకటేశ్వర స్వామి వారి భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. అలానే వారు గంజాయి బ్యాచ్ కోసం, దొంగల కోసం, రౌడీల కోసం, బూతుల నేతల కోసం పరామర్శ యాత్రల పేరిట ప్రజలపై ప్రతీకార యాత్రలు చేస్తూ, అమాయకులను బలి తీసుకుంటున్నారు అని అన్నారు. ఆయన యాత్రలు చేస్తే అయితే మామిడికాయలు, మిరపకాయలు కావాలి లేదా మనుషుల తలా కాయలు కావాలని చంపుకుంటూ వెళ్తూ చేతులు ఊపుతారని అమాయకుల ప్రాణాలు తీస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశంలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి గూగుల్ డేటా సెంటర్, కాగ్నిజెంట్, క్వాంటం కంప్యూటింగ్ అంటూ పెద్దఎత్తున ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తుంటే ప్రతిపక్ష నేత ఏమో శాంతి భద్రతల విఘాతం కోసం పనిచేస్తున్నారని అన్నారు. ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని అన్నారు. ఈ మీడియా సమావేశంలో బీసీ యూత్ అధ్యక్షుడు పరిస సాయి వినయ్, ఐ టీడీపీ కార్యదర్శి తెనాలి చంద్ర శేఖర్, కేసన హేమంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్...

- హెల్త్‌హబ్‌గా ఆంధ్రప్రదేశ్- ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డ్స్ అందించడం ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు - సంజీవని ద్వారా ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్




వైద్యారోగ్య రంగంలో డిజిటల్ సేవలు పెరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డిజిటల్ హెల్త్‌హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2025-26లో ప్రత్యేక ఆరోగ్య సంస్కరణల్లో భాగంగా 'సంజీవని'ని ప్రకటించారు. ఇందులో భాగంగా డిజిటల్ హెల్త్ కార్డులను ప్రయోగాత్మకంగా 2025లో చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ప్రారంభించారు. ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డ్స్ అందించడం ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే దీని ప్రధాన లక్ష్యం. జబ్బు బారిన పడకముందే ముందస్తు చికిత్స చేయడమే కాకుండా, ఏఐ విశ్లేషణ ద్వారా వ్యాధిని ముందే గుర్తించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీంతో ప్రజలకు సులభంగా ఆరోగ్య సేవలు అందించవచ్చని నిపుణులు తెలుపుతున్నారు. సంజీవని ద్వారా ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్ చెయ్యవచ్చు. వారి ఆనారోగ్య పరిస్థితుల వివరాలు తెలుసుకోవడం ద్వారా వ్యాధి సోకకముందే నివారణపై దృష్టి సారించగలిగే అవకాశం ఉంటుంది. ఏఐ ఆధారిత విశ్లేషణల ద్వారా ఎక్కువ మంది ప్రజలను ఇబ్బంది పెడుతున్న వ్యాధులను గుర్తించి, వాటి నివారణపై దృష్టి సారిస్తుంది.



**డిజిటల్ హెల్త్ రికార్డుల్లో ఉండే సమాచారం- వాటి వల్ల ప్రయోజనాలు**

ప్రతి పౌరుడి ఆరోగ్య రికార్డులు డిజిటల్ రూపంలో ఉంటాయి, సంబంధించిత వ్యక్తిగత వైద్య చరిత్ర, ఆరోగ్య పరీక్షల ఫలితాలు, ఆ వ్యక్తికి ఏవైనా వ్యాధి లక్షణాలు ఉన్నట్లైతే దాంతో పాటు ప్రిస్క్రిప్షన్స్ కూడా ఉంటుంది. ఈ డేటా ద్వారా అతడు అనారోగ్య కారణాలతో ఏ వైద్యుడి వద్దకు వెళ్లినా రిపోర్టులు వెంటనే పొంది చికిత్స వేగంగా జరుగుతుంది. డేటా ఆధారంగా ప్రతీ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించి, ముందస్తు చికిత్స, నివారణ కార్యక్రమాలు చేపడతారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చెయ్యడం ద్వారా అవసరమైన సేవలు పొందుతారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్స్ వంటి టెస్టులు చేసి సేవలు అందజేస్తున్నాయి. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా ఇన్స్యూరెన్స్‌తో పెద్ద మొత్తంలోని బిల్స్‌పై ఆర్థిక భారం తగ్గుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అధునాతన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. సంజీవని ప్రాజెక్ట్‌తో పాటు ఉచిత క్యాష్‌లెస్ హెల్త్ ఇన్స్యూరెన్స్ కూడా అమలయ్యేలా ఏర్పాటు చేశారు. 2026 జనవరి 1 నుంచి విస్తరణకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'సంజీవని' ద్వారా జులై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అంబరాన్నంటిన కొండవీడు ఉత్సవాలు

- చారిత్రక వైభవానికి ఆధునిక హంగులు... అబ్బురపరిచే రాజసం... ఆనంద పరవశం
- ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- 14 వ శతాబ్దంలో ప్రోలయ వేమారెడ్డి కొండవీడును నిర్మిస్తే.. నేడు ప్రత్తిపాటి పుల్లారావు దాన్ని పున:నిర్మించారు : డిప్యూటీ స్పీకర్ రఘురామ

చిలకలూరిపేట (చైతన్యరథం): చరిత్రను వర్తమానానికి అన్వయించి.. కొండవీడు ఉత్సవాల నిర్వహణతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తన సమర్థత చాటుకున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తరచూ చెప్పే మాటను మాజీమంత్రి ప్రత్తిపాటి ఆచరణసాధ్యం చేశారని, గతాన్ని విస్మరించకుండా, ఆ జ్ఞాపకాలు, అనుభవాలతో వర్తమానాన్ని సంతోషంగా మార్చుకోవాలనే సీఎం సూచనను కొండవీడు ఉత్సవాల నిర్వహణతో ప్రత్తిపాటి నిజం చేశారని జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి అంబరాన్నంటేలా సాగిన కొండవీడు ముగింపు ఉత్సవాల వేడుకకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ప్రత్యేక అతిథులుగా హాజరై సందడి చేశారు. భారీగా తరలివచ్చిన జనంతో కొండపైకి వెళ్లడానికి మంత్రి, డిప్యూటీ స్పీకర్ తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు రాత్రికి కొండపైకి చేరుకొని గీతామాధురి గానకచేరి, కాంతారా ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్ని వారు వీక్షించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ సింహంటి చిన్నోడే.. వేటకొచ్చాడే పాటకు స్టెప్పులేసి యువతను ఉర్రూతలూగించారు. చివరి నిమిషంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ వేడుకలకు విచ్చేసి, అధికారులకు కనిపించి వెనుదిరిగారు. కార్యక్రమాల వీక్షించిన తర్వాత మంత్రి, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు పర్యాటకుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.

**ఎటు చూసినా, జనంజనం.. ప్రభంజనం : జనార్ధన్ రెడ్డి**

కొండవీడు ఉత్సవాలకు రావాల్సిందేనని ప్రత్తిపాటి గట్టిగా పట్టుబట్టారని, ఆయన కోరిక మన్నించి ముగింపు వేడులకు వస్తే, ఇక్కడ ఎటుచూసినా జనం..జనం..ప్రభంజనమే కనిపించిందని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. కొండపైకి రావడానికే మాకు 2 గంటలకు పైగా సమయం పట్టిందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. కష్టపడి వచ్చిన మాకు.. ఇక్కడి కార్యక్రమాలు.. జనాల ఉత్సాహం చూశాక ఎక్కడలేని సంతోషం కలిగిందన్నారు.

**పల్నాటి కొండవీటి సింహం ప్రత్తిపాటి : డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు**

14 వ శతాబ్దంలో రాజు ప్రోలయ వేమారెడ్డి కొండవీడు కోటను అద్భుతంగా నిర్మిస్తే.. నేడు పల్నాటి ప్రాంత కొండవీటి సింహం ప్రత్తిపాటి దాన్ని పునర్నిర్మించారని అసెంబ్లీ డిప్యూటీ స స్పీకర్ రఘురామకృష్ణరాజు కొనియాడారు. కొండవీడు ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు, అనుమతుల సాధనకోసం ప్రత్తిపాటి ఆనాడు పడిన కష్టాన్ని నేడు చెబుతుంటే.. తనకే ఆశ్చర్యమేసిందన్నారు. ఈ ప్రాంతానికి ఇంత విశిష్టత.. ఈ ఉత్సవాలకు ఇంతటి వైభవం వచ్చాయంటే నాడు టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహకారంతో ప్రత్తిపాటి నిర్మించిన ఘాట్ రోడ్డే కారణమని రఘురామ స్పష్టంచేశారు. ఈ ఉత్సవాలపట్ల ప్రజలు చూపిన అదరాభిమానాలు.. తమ నాయకుడు ప్రత్తిపాటిపై వారికున్న అభిమానానికి నిదర్శనంగా నిలిచాయన్నారు. గీతామాధురి తన గాత్రంతో యువతను ఉర్రూతలూగించారని, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బుర పరిచాయన్నారు. కొండవీడు ఫెస్ట్ -2026 వేడుకలు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా నేత్రత్వంలో అధికారయంత్రాంగం అద్భుతంగా నిర్వహించారని రఘురామ కొనియాడారు.

**కొండవీడు ఫెస్ట్ - అంతులేని ఆనందాల ఫీస్ట్ : మాజీమంత్రి ప్రత్తిపాటి**

రెండ్రోజుల పాటు నిర్వహించిన కొండవీడు ఉత్సవాలు ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, వచ్చే ఏడాది ఉత్సవాల్లో ఇంతకు రెట్టింపు ఆనందం, ఉత్సాహం అందిస్తామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలియచేశారు. కొండవీడు ఫెస్ట్ .. పర్యాటకులకు అంతులేని ఆనందాల ఫీస్ట్ అందించిందన్నారు. ఉత్సవాలను ఇంతటి ఘనంగా నిర్వహించి, ప్రతి ఒక్కరి సంతోషానికి కారకులైన జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, ఇతర ప్రధానాధికారులు. నిర్వాహకులకు, కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులు, యువతకు, సినీ సంగీత కళాకారులకు, పటిష్టమైన బందోబస్త్ తో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసిన పోలీస్ వారికి ప్రత్తిపాటి సభాముఖంగా ప్రృతేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియచేశారు.



**పల్నాటి ప్రాంత చరిత్ర సంరక్షణలో ప్రత్తిపాటి మేటిగా నిలిచారు : ఎమ్మెల్యే జూలకంటి**

పల్నాడంటేనే ఘనచరిత్రని, పల్నాటి యుద్ధం ఒక మినీ మహాభారతమని, అంతటి ఘన చరిత్ర కలిగిన ప్రాంతవాసులమైన మనందరం మన చరిత్రను సంరంక్షించుకోకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతామని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభిప్రాయపడ్డారు. మనదైన చరిత్ర సంరక్షణలో మాజీమంత్రి ప్రత్తిపాటి...తనకు తానే మేటిగా నిలిచారని, ఈ ప్రాంత నాయకులకే ఆదర్శంగా నిలిచారని జూలకంటి ప్రశంసించారు. కొండవీడు ఖ్యాతి ఉన్నంతవరకు..ప్రత్తిపాటి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఉత్సవాలు ప్రజల మదిలో నిలిచిపోతాయన్నారు. భవిష్యత్ లో మన ప్రాంతంలో బుద్ధ భగవానుడు నడయాడిన నేల అయిన నాగార్జున సాగర్ చరిత్ర. పల్నాటి ప్రాంత వైభవాన్ని దశదిశలా వ్యాపింపచేసేం దుకు కూటమి ప్రభుత్వం సహకరించాలన్నారు.



**కొండవీడు ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్తిపాటి ఎంతో కష్టపడ్డారు: హిమాంశు శుక్లా ( నెల్లూరు జిల్లా కలెక్టర్)**

2016లో తొలిసారి ఇక్కడకు వచ్చామని, నాడు మంత్రిగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తితో ఈ కొండపైకి నడిచి వచ్చామని, అప్పటికీ..ఇప్పటికీ ఇక్కడ చేసిన అభివృద్ధి చూస్తుంటే ఎంతో ఆశ్చర్యం కలిగిందని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా తెలియచేశారు. ఆనాడు మంత్రిగా ఉన్న ప్రత్తిపాటి.. కొండవీడుకోటపైకి ఘాట్ రోడ్డు నిర్మించడంకోసం సంబంధిత శాఖలన్నింటిని సంప్రదించి, అధికారులందరి చుట్టూ తిరిగి, ఎట్టకేలకు నాటి..నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో అనుకున్నది సాధించారని హిమాంశు శుక్లా నాటి సంఘటనలు వివరించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడంలో తనకు తానే సాటి అని ప్రత్తిపాటి నిరూపించుకున్నారన్నారు. ఆనాడు ఆయన కృషి వల్లే నేడు ఈ ఉత్సవాలను ఇంత సంతోషంగా జరుపుకున్నట్టు చెప్పారు.

**అంబరాన్నంటిన ముగింపు వేడుకలు..**

కొండవీడు ఉత్సవాలు ముగింపు వేడుకలు అంబరాన్నంటాయి. కొండపైన ఉన్నామా.. లేక మరేదైనా లోకంలో ఉన్నామా అనిపించేంతలా రంగురంగుల విద్యుత్ దీపకాంతులు.. చిన్నారుల నృత్యప్రదర్శనలు.. గీతామాధురి గానకచేరి, కాంతారా ప్రదర్శన వంటివి పర్యాటకుల్ని అమితంగా ఆకర్షించాయి. కూర్చున్నచోటి నుంచి లేవకుండా సందర్శకులు సాంస్కృతిక ప్రదర్శనల వీక్షణలో మునిగిపోయారు. కొండవీడు ఉత్సవాల ముగింపు వేడుకలకు తరలివచ్చిన రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, జూలకంటి, పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా, నెల్లూరు కలెక్టర్ హిమాంశ్ శుక్లా (కృతికా శుక్లా భర్త)లు, ప్రధానాధికారులు కూడా పర్యాటకులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. క్షణం తీరికలేని పరిస్థితులున్నప్పటికీ అక్కడి ఆనందోత్సాహాల వాతావరణం చూశాక..వారు తమ పాదం కదపకుండా ఉండలేకపోయారు. ఆదివారం అర్ధరాత్రి వరకు అట్టహాసంగా సాగిన వేడుకలు, చిన్నారులు..యువత కేరింతలతో ముగింపు సంబరాలు మిన్నంటాయి. ఏదైనా దేశంలో కొత్త సంవత్సర వేడుకల్లో ఉన్నామా అనిపించేంతలా నిర్వాహకులు చివరిలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షో ప్రజల్ని విశేషంగా ఆకట్టుకుంది. డాన్సర్లతో కలిసి హీరో నందమూరి బాలయ్య సింహమటి చిన్నోడే గీతానికి స్టెప్పులు వేసిన రఘురామ, ఎమ్మెల్యే జూలకంటి.. ఉత్సవాలకు విచ్చేసిన ప్రజలు, పర్యాటకుల్ని ఉత్సాహపరిచి, వారితో కేరింతలు కొట్టించారు. సినీగాయని గీతామాధురి గాత్రానికి అనుగుణంగా పాదం, పెదవులు కదుపుతూ రఘురామ ఉల్లాసంగా కనిపించారు. ముగింపు వేడుకల వేదికపైనే కలెక్టర్లు హిమాంశు శుక్లా, కృతికా శుక్లా దంపతులకు మంత్రి, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు, అధికారులు వివాహ దినోత్సవ శు భాకాంక్షలు తెలియచేసి వారిని ప్రత్యేకంగా అభినందించారు. వేడుకలకు తరలివచ్చిన అశేష జనసందోహంతో కొండపైనుంచి దిగువకు, దిగువ నుంచి కొండపైకి వెళ్లే వాహనాలతో ఒకదశలో ట్రాఫిక్ స్తంభించింది. పోలీస్ శాఖ చర్యలకు తమవంతుగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు. అదే సమయంలో కొండపైనుంచి కిందకు వస్తున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ తన కారులో నుంచి దిగి, ఎమ్మెల్యేతో కలిసి ట్రాఫిక్ తొలగింపులో పాల్గొన్నారు. వాహనాలు కదిలి వెళ్లిన అనంతరం ప్రత్తిపాటి.. కృష్ణ తేజతో మాట్లాడి, ఆయనకు వీడ్కోలు పలికారు.

## వివాహితపై అత్యాచార యత్నం.. బెదిరింపు

ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తిరువూరు రూరల్ మండలంలోని ఎరుకోపాడు గ్రామంలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన సురగం శ్రీనివాసరావు అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే.. తనతో సహా భర్త, పిల్లలను చంపేస్తానని నిందితుడు బెదిరించాడని బాధితురాలు వాపోయారు. ఈ ఘటనపై.. భర్త ఎరువ బ్రహ్మం, గ్రామపెద్దల సహకారంతో గత బుధవారం తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారామె. అయితే.. ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు తమకు సరైన న్యాయం జరగలేదని బాధితురాలు ఆవేదన చెందారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు తగిన న్యాయం చేయాలని భర్త డిమాండ్ చేశారు. తిరువూరు పోలీసులు చిన్నపాటి సెక్షన్లు మాత్రమే పెట్టి.. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై త్వరితగతిన దర్యాప్తు జరిపి, నిందితుడిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాధితులు డిమాండ్ చేశారు.

## ప్రవాసాంధ్ర బీమాతో ధీమా... విదేశాల్లో మృతి చెందితే రూ.10 లక్షల పరిహారం

ప్రవాసాంధ్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏపీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి "ప్రవాసాంధ్ర భరోసా" ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల బీమా పరిహారం అందజేసింది. ప్రవాసాంధ్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్నారైల సాధికారిత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ద్వారా ఎన్ఆర్ఐల సంక్షేమం, భద్రత, అభివృద్ధి కోసం కృషి చేస్తామని తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్టీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రవాసాంధ్రులు ఏపీఎన్ఆర్టీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**ప్రవాసాంధ్ర భరోసా పథకంలో నమోదు :** సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామానికి చెందిన భవనాసి సత్యబాబు కుటుంబానికి "ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకం" కింద రూ.10లక్షల పరిహారాన్ని కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ వివిధ దేశాలకు వలస వెళ్లిన ప్రవాసాంధ్రులకు అన్నివిధాల సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.

# నెయ్యి కల్తీ దుర్మార్గులను ఉరి తీసినా పాపం లేదు

- మహాపాపలకు పాల్పడ్డ వైవీ సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలి
- ప్రభుత్వాన్ని కోరిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): నెయ్యి కల్తీ దుర్మార్గులను ఉరి తీసినా పాపం లేదని, మహాపాలకు పాల్పడ్డ వైవీ సుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మీడియాతో మాట్లాడుతూ... తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంతోపాటు వైసీపీ నాయకుల అబద్ధాలు, ఫేక్ ప్రచారాలు, నేర ప్రవృత్తిపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మీ ఫోన్ నెంబరే మిమ్మల్ని పట్టించింది.. చిన్నప్పన్న సుబ్బన్న ఒకటేనని దేవినేని ఉమా వ్యాఖ్యానించారు. 2018 మార్చి 15న వైవీ సుబ్బారెడ్డి లెటర్‌హెడ్‌పై ట్వీట్ చేసిన చిన్నప్పన్న నంబర్ 9542419999నే కల్తీ నెయ్యి కుంభకోణంలో కీలకంగా వాడారని, ఇది సిట్ అభియోగపత్రంలో స్పష్టమైందని ఆరోపించారు. తప్పులపై తప్పులు బయటపడుతున్నా వైసీపీ తీరు మారడం లేదు. అబద్ధాలు, అసత్యాలతో ఫేక్ ప్రచారాలు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ నాయకులపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఁపాలు, వెన్న లేకుండా టన్నుల కొద్దీ నెయ్యి తయారు చేయించారు. అన్నప్రసాదంలో నాసిరకం బియ్యం పెట్టి పవిత్రత దెబ్బతీశారనే అని ఆరోపించారు. కల్తీ మహాపాపలకు పాల్పడ్డ వైవీ సుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, జగన్నాటకాలన్నీ బట్టబయలు చేసి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ చేసిన దొంగలు.. దుర్మార్గులను ఉరి తీసినా పాపం లేదు అంటూ ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. నేర ప్రవృత్తి, క్రిమినల్ యాటిట్యూడ్, అక్రమాస్తుల కేసుల్లో ఉన్న వ్యక్తులు నీతులు చెబుతున్నారని, హైదరాబాద్‌లో వందల కోట్ల భూకబ్జాలు చేసి సీబీఐ, ఈడీ విచారణలు ఎదుర్కొంటున్నవారు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని విమర్శించారు. పరామర్శల పేరుతో చేసిన దండయాత్రలో ఇద్దరి ప్రాణాలు పోయినందుకు సంబంధితులను అరెస్టు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

# రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

- రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: జీవి ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): రైతుల ఆకాంక్షకు అనుగుణంగా రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు తెలిపారు. వినుకొండ మండలం గోకనకొండ గ్రామంలో సోమవారం నిర్వహించిన "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్ విప్ జీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 22 లక్షలకు పైగా రాజముద్రతో పాస్ పుస్తకాలు ప్రభుత్వం జారీ చేసిందన్నారు. గత వైసీపీ పాలనలో రైతుల పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ ఫోటోలు వేసుకున్నారని, చివరికి సర్వే హద్దురాళ్లు సైతం వదల్లేదు అన్నారు. ఫోటోలకి పిచ్చోలకు కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు సరిచేస్తూ కూటమి ప్రభుత్వం భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నారని తెలిపారు. గతంలో భూమి సబ్ డివిజన్ చేసేందుకు 550 రూపాయలు చెల్లించాల్సి ఉందని, నేడు కూటమి ప్రభుత్వ పాలనలో కేవలం 50 రూపాయలతో సబ్ డివిజన్ చేయటం జరుగుతుందని, సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రైతు సంక్షేమ ప్రభుత్వం సాగుతుందన్నారు. రైతు ఆర్థిక ఆదాయం పెంచేందుకు ఉద్యాన పంట సాగును కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ అనేక రాయితీ రుణాలు అందిస్తుందన్నారు. రైతులకు అందిస్తున్న సంక్షేమ రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతు ఆర్థిక ప్రగతి సాధించాలని ఆయన కోరారు. గత వైసీపీ పాలనలో గ్రామంలో వర్గాల మధ్య చిచ్చు, ప్రజల మధ్య వివాదాలు పెట్టి ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అశాంతిని నెలకొల్పారన్నారు. పచ్చని పల్లెలు ప్రశాంతంగా ఉండాలని, గ్రామాల అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో అన్ని పార్టీలకు చెందిన ప్రజలు ఐక్యంగా ఉండి, ఎన్నికల సమయంలో ఎవరి అభిమానానికి తగ్గట్టుగా ఓట్లు వేసుకొని అనంతరం గ్రామాభివృద్ధికి గ్రామ పెద్దలందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో జగ్గయ్యపేట... రూ.3 కోట్ల నిధులతో పనులు



జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి సోమవారం పట్టణంలోని 1వ మరియు 2వ వార్డులలో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడమే లక్ష్యంగా సాగిన ఈ పర్యటనలో వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. వార్డు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్థానిక పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వార్డుల్లో ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు మరియు సిమెంట్ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ప్రజల విన్నపాలకు తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శుభవార్త వినిపించారు. వార్డు ప్రజలు ప్రధానంగా కోరుతున్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.3 కోట్ల భారీ నిధులను డి.ఎం.ఎఫ్ గ్రాంట్స్ ద్వారా కేటాయించినట్లు ప్రకటించారు. రానున్న 10 రోజుల్లోనే పూర్తిస్థాయిలో పనులు మొదలుపెట్టి, నాణ్యతతో వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తక్షణ స్పందన మరియు నిధుల కేటాయింపు పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు



తిరుమల / గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరిపై ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

# లోకేశ్ నాయకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా

- రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండాను రెపరెపలాడిస్తా
- నిమ్మకూరులో టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసిన గురుమూర్తి



పామర్రు (చైతన్యరథం): అన్న ఎన్టీఆర్ రాముడైతే ఆయన మనవడుగా పుట్టిన నారా లోకేశ్ ఓ మహా యోధుడు అని తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఎన్టీఆర్ స్వగ్రామమైన పామర్రు మండలం నిమ్మకూరు గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా అధ్యక్షునిగా వీరంకి వెంకట గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గోపు సత్యనారాయణతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్టీఆర్ - బసవతారకం పుణ్య దంపతుల విగ్రహాల సాక్షిగా జరిగిన ఈ ప్రమాణస్వీకార మహోత్సవానికి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎన్టీ రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ, మంత్రులు ఎస్ సవిత, కొలుసు పార్థసారథి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గురుమూర్తి మాట్లాడుతూ... తాతకు తగ్గ మనవడుగా, తండ్రికి తగ్గ తనయుడుగా నారా లోకేశ్ రాణిస్తున్నారన్నారు. ఓ పక్క అభివృద్ధి, మరోపక్క రాజకీయ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీని ఒంటి చేత్తో నడిపగల సత్తా ఉన్న నాయకుడు నారా లోకేశ్ అని అన్నారు. అటువంటి నాయకుడి నాయకత్వంలో టీడీపీ జిల్లా అధ్యక్షునిగా పని చేసే అవకాశం కల్పించిన అధినేత చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఇప్పటి వరకు టీడీపీనే నా బలం, బలగంగా పని చేశానని, రానున్న రోజుల్లో కూడా అదే విధంగా పని చేస్తానన్నారు. మీ ఇంటి బిడ్డగా ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అందరినీ సమన్వయం చేసుకుని కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

సాధారణ కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడమే కాకుండా టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. ఎంతో మంది రాజకీయ ఉద్దండులు అలంకరించిన తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ పగ్గాలను చేపట్టడం గర్వంగా తనకు ఉందన్నారు. నాడు మంత్రి పదవి కోసం చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడికి వెళ్లిన వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. అటువంటి వ్యక్తి నేడు చంద్రబాబు, లోకేష్‌పై అవాకులు చవాకులు పేలుతున్నాడని గురుమూర్తి మండిపడ్డారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# లా విద్యార్థికి పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా



గుంటూరు (చైతన్యరథం): నగరంలో పరుచూరి వీర రాఘవులు సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు పరుచూరి సంజీవరావు సౌజన్యంతో రామిరెడ్డితోటకు చెందిన వెంకటేశ్వరరావు అనే విద్యార్థికి అవసరమైన విలువైన "లా బుక్స్" ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవా సమితులు ముందుకు వచ్చి ఇలాంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, విద్య అనేది ప్రతి ఒక్కరికీ హక్కు అని, ఆ దిశగా పరుచూరి వీర రాఘవులు సేవా సమితి చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని ప్రశంసించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువుపై ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లా విద్య ద్వారా వెంకటేశ్వరరావు మంచి భవిష్యత్తును నిర్మించుకుని సమాజానికి సేవ చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామరాజు గడ్డ కిరణ్, సాంబశివరావు, కే.సుబ్బారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

# అరాచక శక్తులను ఏరివేయండి

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, గుమ్మళ్ళదిబ్బలో బాధిత కుటుంబానికి పరామర్శ, ఆడపిల్లలపై అన్యాయం జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదు, గుమ్మళ్ళదిబ్బలో నైట్ పెట్రోలింగ్ పెంచండి, హై స్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు**



కోవూరు, (చైతన్యరథం): పంచాయతీ పరిధిలోని గుమ్మళ్ళదిబ్బలో మైనర్ బాలిక మృతి చెందడం దురదృష్టకరమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మళ్ళదిబ్బ జెఎస్ఆర్ కాలనీలోని మృతురాలి కుటుంబాన్నికలిసి ఆమె పరామర్శించారు. మైనర్ బాలిక మరణానికి కారకులైన అరాచక శక్తులను ఏరివేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పోలీసులను ఆదేశించారు. మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని, వారికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. బాధిత కుటుంబానికి ఇప్పటికే పోలీసు రక్షణ కల్పించామని, ప్రభుత్వం తరపున వ్యక్తిగతంగా తాను బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పరామర్శ అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ పిల్లలతో మాట్లాడి భద్రతపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు లేదా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 112 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి యాకసిరి వెంకటరమణమ్మ, బెజవాడ వంశీకృష్ణారెడ్డి మండల మైనారిటీ నాయకులు జహంగీర్, జమీర్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఒంగోలు నియోజకవర్గంలోని 89 మంది లబ్ధిదారులు కు 64.11 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు



పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళి మోహన్ క్యాంపు కార్యాలయంలో పీజీఆర్ఎస్ సమావేశం జరిగింది

# గోపన్నపాలెం గ్రామానికి మహర్దశ..!

**సిమెంట్ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



జలదంకి, (చైతన్యరథం): జలదంకి మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని అప్రోచ్ రోడ్డు నుండి గోపన్నపాలెం గ్రామంలోనికి 50 లక్షల రూపాయల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న అనేక గ్రామాలకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ నిధుల ద్వారా రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని పేర్కొన్నారు. గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత చేరువవుతాయని, రైతులకు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. గోపన్నపాలెం గ్రామంలో నిర్మించిన ఈ సిమెంట్ రోడ్డు గ్రామాభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



అమరావతి గ్రౌండ్స్‌లో టీడీపీలో చేరిన 32 కుటుంబాలకు కండువా కప్పి టీడీపీలోకి స్వాగతించిన ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

# అడగ్గానే విద్యుత్ సమస్యను పరిష్కరించిన జననేత



నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32,33, 34వ డివిజన్‌లలో, 41 లక్షల 33వేల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను స్థానిక కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, కరణం మంజుల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజా బాటలో భాగంగా ఈ ప్రాంతాలకు వచ్చినప్పుడు, స్థానిక ప్రజలు లో వోల్టేజ్ సమస్యను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, వెంటనే అధికారులతో మాట్లాడి నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో లో-వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలలో సమస్య పరిష్కారం దిశగా 1 కోటీ 40 లక్షల రూపాయలతో 14 నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వందలకోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నామని కోటంరెడ్డి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా రూరల్ శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. పై కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు, కో క్లస్టర్ ఇంచార్జ్ లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు చెల్లింపుల్లో అప్రమత్తంగా ఉండాలి

## మహిళా సంఘాల సభ్యులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు




రాప్తాడు, (చైతన్యరథం): మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించిన డబ్బుల చెల్లింపులో అప్రమత్తంగా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆత్మకూరు మండలం కేంద్రంలో జరిగిన మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జెండర్ రీసోర్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. ఆ తర్వాత మండలంలోని 874సంఘాల్లోని 5165మంది సభ్యులకు మంజూరైన రూ.44.80కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలు స్వయం ఉపాధి సాధించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చారన్నారు. ఆరోజు మనం ధైర్యంగా అడుగు బయట పెట్టి.. ఈ రోజు కుటుంబాల్ని పోషించే స్థాయికి వచ్చామన్నారు. బ్యాంకులు ఎలాంటి షూరిటీ లేకుండా రుణాలు ఇచ్చేది ఒక్క మహిళా సంఘాలకు మాత్రమేనన్నారు. వారు కూడా క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తూ వివిధ పనుల్లో స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. అయితే మహిళా సభ్యులు తీసుకున్న ఋణాలు చెల్లిస్తున్నప్పటికీ కొంత మంది యానిమేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా అనంతపురం రూరల్ మండలంలోని 5సంఘాలకు సంబంధించి 50లక్షలు, చెన్నేకొత్తపల్లిలలో 32లక్షల వరకు మోసం జరిగిందన్నారు. ఇలాంటి మోసాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. మన డబ్బులు-మన లెక్కలు యాప్ ద్వారా ఎంత రుణం తీసుకున్నాం.. ఎంత చెల్లిస్తున్నాం. ఇంకా ఎంత చెల్లించాలి. వంటి వాటి వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. దీనిపై అధికారులు సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. చదువు రాని మహిళలు ఇంట్లో తమ పిల్లలకు చూపించి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా మోసాలకు ఆస్కారం ఉండదన్నారు. జెండర్ రీసోర్స్ సెంటర్లను కూడా ప్రారంభించామని, ఇది సభ్యులు తమ సమస్యలను చెప్పుకునేందుకు వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఆత్మకూరు మండలంలోని మండల సమాఖ్యలో 956సంఘాలు.. 8767మంది సభ్యులు ఉండగా..బ్యాంక్ లింకేజీ ద్వారా 416సంఘాల్లోని 4125 మంది సభ్యులకు 31కోట్ల 50లక్షల రూపాయలు, స్త్రీ నిధి ద్వారా 290సంఘాల్లోని 752మంది సభ్యులకు 7కోట్ల 21రూపాయలు, ఉన్నతి ద్వారా 49సంఘాల్లో 83 మంది సభ్యులు 7కోట్ల 30లక్షలు, సీఐఎఫ్ ద్వారా 64లక్షలు, స్త్రీ శక్తి ద్వారా 90సంఘాల్లోని 90మందికి కోటి రూపాయలు ఇలా మొత్తం ఇప్పటి వరకు 874సంఘాల్లోని 5165మంది సభ్యులకు రూ.44.80కోట్ల రుణాలు మంజూరయ్యాయన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. అంతే కాకుండా మహిళల కోసం ఎన్నికల ముందు హామీ మేరకు తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటివి అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత వివరించారు.

## కూటమి ప్రభుత్వం రాకతో

# పట్టుపరిశ్రమకు పూర్వవైభవం

## పట్టు పరిశ్రమ పనిముట్లు, రోగ నిరోధక మందుల పంపిణీలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర పట్టణం, (చైతన్యరథం): మడకశిర పట్టణం పట్టు పరిశ్రమ కార్యాలయంలో పట్టు పరిశ్రమ పనిముట్లు రోగ నిరోధక మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వం పాలనలో పట్టు పరిశ్రమను నిర్వీర్యం చేసి రైతులకు రీలర్లకు రావలసిన బకాయిలను చెల్లించకుండా వదిలి వేయడం జరిగిందిదన్నారు. దీని వల్ల తీవ్రంగా పట్టు రైతులు రీలర్లు నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మడకశిర మండలం గుండుమల గ్రామానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు పట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని పోవడంతో మరియు అసెంబ్లీ సమావేశంలో పట్టు పరిశ్రమలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించడంతో సంబంధిత మంత్రులు స్పందించి గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించడం జరిగిందన్నారు .అందులో భాగంగానే జనరల్ రైతులకు 50% సబ్సిడీతో మరియు ఎస్సీ ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీతో యంత్ర పరికరాలను పవర్ స్ప్రేయర్ మరియు బ్రష్ కట్టర్ అందిస్తున్నారు, జనరల్ రైతులకు 75శాతం సబ్సిడీతో ఎస్సీ ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీతో రోగ నిరోధక మందులు అందిస్తున్నారు, వీటితోపాటు పట్టుపురుగుల షెడ్డు నిర్మించుకోవడానికి జనరల్ రైతులకు 75 శాతం సబ్సిడీ ఎస్సీ ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీ అందివ్వడం జరుగుతోంది అవసరమున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటిగ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, పట్టు పరిశ్రమ అధికారులు రైతులు పాల్గొన్నారు.



## శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీశైలం, (చైతన్యరథం): అష్టాదశ శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అధికారులు, అర్చకులు యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చతుర్వేదపారాయణం, వేదస్వస్థి జరిపించారు. లోకకల్యాణార్థం ఆలయంలో బ్రహ్మోత్సవ శివ సంకల్పాన్ని పఠించారు. రాత్రి సకల పరివార దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు దంపతులు, శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, ప్రధానార్చకులు విజయ్, ట్రస్టుబోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర రావు దంపతులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు సోమవారం భృంగివాహన సేవ నిర్వహిస్తారు.



# పేదల పాలిట పెన్నిధి... ముఖ్యమంత్రి సహాయనిధి!

## ఆలూరు టీడీపీ నేతలు వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివ ప్రసాద్

ఆలూరు, (చైతన్యరథం): స్వయంగా తమ చేతుల మీదుగా ఆలూరు నియోజకవర్గం వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో 87 మంది లబ్ధిదారులకు 49,14,467/- రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. ఆస్పరి మండలంలో 12 మంది లబ్ధిదారులకు రూ. 4,35,490లు, చిప్పగిరి మండలంలో 17 మంది లబ్ధిదారులక రూ, 6,00,370లు హాలహర్వి మండలంలో 07 మంది లబ్ధిదారులకు రూ. 2,76,778లు, దేవనకొండ మండలంలో 08 మంది లబ్ధిదారులకు 3,58,423లు, ఆలూరు మండలంలో 29 మంది లబ్ధిదారులకు 20,85,076లు, హొళగుంద మండలంలో 14 మంది లబ్ధిదారులకు రూ, 11,58,330లు మంజూరయ్యాయి. దేవనకొండ మండలం నుండి ఎరుకల రాముడు (కప్పట్రాళ్ల) 40345 రూపాయలు కురువ హేమావతి (అలారుదిన్నె) రూ. 31084 రూపాయలు, రాచకొండ లక్ష్మి (దేవనకొండ) 16900 రూపాయలు, గార్ల గద్ద నరసింహుడు (గుండ్లకొండ) రూ. 35000లు తలమరి మాధమ్మ, (కోటకొండ) 42205 రూపాయలు, వడ్డె విజయలక్ష్మి (జిల్లెల బుడకల) 40795లు, బోయ కౌలుట్లయ్య (వెలమకూరు) రూ. 32586లు దాసరి రామకృష్ణ (ఐరన్ బండ) రూ. 119508లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవనకొండ మండలం నుంచి కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, రామారావు నాయుడు మల్లికార్జున గౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున రామదాస్ గౌడ్, ఆకుల వీరేష్ వెంకటస్వామి గౌడ్ డి ఉచిరప్ప గుడిమిరాళ్ల కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు

జాతీయం

చైతన్యరథం



# సర్‌కు ఆటంకం కల్పించొద్దు

## రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు

బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' ప్రక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. 'ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ ప్రక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. దీంతో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ఎన్నికల తుది జాబితా గడువును మరో వారం రోజుల పాటు (ఫిబ్రవరి 21 వరకూ) పొడిగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

# తరగతి గదిలో తుపాకీ పేలుళ్ళు



పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడు క్లాస్ రూములో యువతిపై తుపాకితో కాల్పులకు తెగబడ్డాడు. యువతిని కాల్చి చంపి, తను కూడా అదే తుపాకితో కాల్చుకున్నాడు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. తార్న్ తరణ్ జిల్లాకు చెందిన ప్రిన్స్ రాజ్, సందీప్ కౌర్‌లు ఉస్మా గ్రామంలోని లా కాలేజీలో ఫస్ట్ ఇయర్ లా చదువుతున్నారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, రాజ్.. కౌర్‌పై పగ పెంచుకున్నాడు. సోమవారం ఉదయం కాలేజీకి రాగానే ఈ దారుణానికి ఒడిగట్టాడు.తన వెంట తెచ్చుకున్న తుపాకితో క్లాస్ రూములో కౌర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో కౌర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కౌర్ చనిపోయిందని ధ్రువీకరించుకున్న తర్వాత రాజ్ అదే తుపాకితో తనను తాను కాల్చుకున్నాడు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలపాలైన రాజ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. రాజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇక ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రాజ్.. కౌర్‌ను ఎందుకు చంపాడన్న విషయాన్ని తెలుసుకునే పనిలో పడ్డారు.



## 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్'తో

# డిజిటల్ మోసాల కేసులకు చెక్

### కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ "పచ్చి దోపిడీ, డెకాయిటీ" అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్, మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోం శాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సీబీఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని దిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. "కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.15-20 వేల పెన్షన్ తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే, మీ ఏఐ టూల్స్ ఎందుకు అలర్ట్ చేయడం లేదు?" అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, "అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి" అని సూచించారు. కేవలం ఆర్‌బీఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న ఒక సైబర్ నేరం. ఇందులో నేరగాళ్లు తాము పోలీస్ ఆఫీసర్లమని, కోర్టు లేదా ప్రభుత్వ అధికారలమంటూ బాధితులను నమ్మిస్తారు. ఆడియో లేదా వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించి, వారిని గృహ నిర్బంధంలో ఉన్నట్లు భ్రమ కలిగిస్తారు. తీవ్రమైన ఒత్తిడికి గురిచేసి వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తారు.



# ఎదుగుతున్న భారత్‌కు దిగిమతుల రికార్డులు అసాధారణం కాదు : కేంద్ర మంత్రి పీయూష్

అమెరికా నుంచి ఐదేళ్లలో రూ.45 లక్షలకోట్ల దిగుమతులు పెద్ద విషయమేమీ కాదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2,717 లక్షల కోట్ల (30 ట్రిలియన్ డాలర్ల) ఆర్థిక వ్యవస్థగా ఎదిగే లక్ష్యంతో ముందుకెళ్తున్న మన దేశానికి ఆ స్థాయి దిగుమతులు సాధారణమేనని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అమెరికా నుంచి అత్యంత భారీగా దిగుమతులు చేసుకునేందుకు భారత్ అంగీకరించడంపై ఆయన పీటీఐ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "వచ్చే ఐదేళ్లలో కేవలం వైమానిక రంగం కోసమే రూ.9 లక్షల కోట్లు (100 బిలియన్ డాలర్లు) అవసరం. ఇక చమురు, సహజవాయువు, ఎల్పీజీ ఉత్పత్తుల దిగుమతులు అంతకన్నా చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం భారత్ వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న రూ.27 లక్షల కోట్ల (300 బిలియన్ డాలర్ల) ఉత్పత్తులను అమెరికా నుంచే దిగుమతి చేసుకోవచ్చు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి మనం దిగుమతులు చేసుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో మన దిగుమతులు రూ. 181 లక్షల కోట్ల (2 ట్రిలియన్ డాలర్ల)కు పెరుగుతాయి. భారత్‌లో భారీగా డిమాండ్ ఉండటం ఖాయమని, అందుకు తగినట్టుగా మీరు ఉండాలని అమెరికా వాణిజ్య అధికారులకు నేను స్పష్టంగా చెప్పాను కూడా. ఇప్పటికే అమెరికా నుంచి భారత్‌కు రూ.4.5 లక్షల కోట్ల (50 బిలియన్ల) మేర దిగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోంది. అందుకు అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక యంత్రాల నుంచి డేటా సెంటర్లు, వైమానిక రంగ అవసరాల దాకా భారీ స్థాయిలో అవసరం. ఉక్కు పరిశ్రమలకు కోకింగ్ కోల్ (అత్యధిక నాణ్యత ఉన్న రాతిబొగ్గు) కావాలి. పెరుగుతున్న దేశీయ వినియోగానికి తగినట్టుగా చమురు ఉత్పత్తులు అవసరం. వాటన్నింటికీ అమెరికా సరఫరా చేయగలదు" అని గోయల్ పేర్కొన్నారు. నిజానికి ఇవన్నీ యూపీఏ అధికారంలో ఉన్నప్పటి నుంచీ దిగుమతి అవుతున్నవేనని, ఇప్పుడు కొత్తగా ఏమీ లేదని తెలిపారు. ఇక అమెరికా సుంకాలు 18శాతానికి తగ్గడం మంచి పరిణామమని అభివర్ణించారు. అమెరికాలో మన సరుకులకు పోటీ ఇచ్చే చైనాపై 35శాతం, ఇతర దేశాలపై 19, ఆపైన సుంకాలు ఉన్నాయని.. అంటే మన ఉత్పత్తులు తక్కువ ధరకే అందుబాటులో ఉండి డిమాండ్ పెరుగుతుందని, మన ఎగుమతులు పెరుగుతాయని చెప్పారు. ప్రస్తుత అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం సంయుక్త ప్రకటన కేవలం రెండు పేజీల ఫ్రేమ్‌వర్క్ మాత్రమేనని.. ఇందులో చేర్చాల్సినవి ఇంకా చాలా ఉంటాయని పీయూష్ గోయల్ చెప్పారు. భారత్‌లో వ్యవసాయ, పాడి రంగాల ప్రయోజనాలు దెబ్బతినకుండా వాణిజ్య ఒప్పందంలో రక్షణలు కోరినట్టే.. అమెరికా కూడా మన ఉత్పత్తులు వెల్లువలా వచ్చిపడకుండా రక్షణలు కోరుతుందని తెలిపారు. చర్చల్లో ఇది సాధారణమేనని, ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. అంతేతప్ప ఈ సంయుక్త ప్రకటనలో ఫలానా అంశాలపై రక్షణలు లేవంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.

# 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో పశ్చిమా సియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరాన్‌కు చేరువ లో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 37 ఏళ్ల సంప్రదాయానికి బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 8న ఎయిర్‌ఫోర్స్ కమాండర్లతో ఏటా ఆయన భేటీ అవు తుంటారు. ఈసారి ఆ సమావేశంలో ఆయన పాల్గొనలేదని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 1980లో సుప్రీంలీడర్‌గా బాధ్యతలు అందుకున్న దగ్గరినుంచి చివరకు కరోనా సమయంలో కూడా ఈ వార్షిక సమావేశాన్ని ఆయన మిస్ చేయకపోవడం గమనార్హం. 1979లో ఫిబ్రవరి 8న పహ్లవీ పాలకులకు వ్యతిరేకంగా రుహొల్లా ఖొమేనీకి వాయుసేన అధికారులు విధేయత ప్రకటించారు. దాంతో గత నాలుగు దశాబ్దాలుగా ఆ రోజుకు గుర్తుగా ఎయిర్‌ఫో ర్స్ అధికారులు సుప్రీం లీడర్‌తో సమావేశం అవుతుంటారు. ఇదిలాఉంటే.. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరిం పులు పెంచుతోంది. ఆ దేశం వైపు తమ నౌకాదళం కదులు తోందని, అది అక్కడికి చేరుకున్న తర్వాత ఎలా పనిచేస్తుందో చూద్దామంటూ ట్రంప్ హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిం దే. ఒకవైపు రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగు తుండగా.. మరోవైపు ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరుగుతు న్నాయి. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# అమెరికాకు భయపడేది లేదు..

## యురేనియం శుద్ధిపై ఇరాన్ స్పష్టం

యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరని అమెరికాకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. అమెరికాతో అణు చర్చలు జరుగుతు న్న వేళ ఇరాన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య అణు కార్యక్ర మంపై చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యురేనియం శుద్ధిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యురేనియం శుద్ధిపై మేమెందుకు వెనక్కి తగ్గాలి. అమెరికాపై మాకు పెద్దగా నమ్మకం లేదు. మమ్మ ల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. ఒకవేళ మాపై యుద్ధం ప్రకటించినా మేం యురేనియం శుద్ధిపై వెనక్కి తగ్గేది లేదు. ఈ ప్రాంతంలో వారి (అమెరికా) సైనిక మోహరింపు మమ్మల్ని భయపెట్టలేదు' అని అబ్బాస్ వ్యాఖ్యానించారు. అలాగే అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన రష్యా, చైనాతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్టు అబ్బాస్ తెలిపారు. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి



పెంచేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన సైనిక మోహరింపును పెంచుతోంది. ఒకవేళ ఇరాన్‌తో చర్చలు విఫల మైతే ఆ దేశంపై దాడులకు దిగుతామని అమెరికా పరోక్షంగా సంకేతాలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో మధ్య ప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### వలసదారులను నిర్బంధించే విధానంపై

# ట్రంప్‌నకు కోర్టులో భారీ విజయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపనకు కోర్టులో భారీ విజయం దక్కింది. బాండ్ హియరింగ్‌కు అనుమతి ఇవ్వ కుండానే వలసదారులను నిర్బంధించే ఆయన ప్రభుత్వ విధానా న్ని అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ఇలాంటి నిర్బంధాలను ఇటీవల దిగువ కోర్టులు తప్పుబడుతున్న నేపథ్యంలో ఈ తీర్పు ట్రంప్ నకు భారీ న్యాయ విజయంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వలసదారులను అరెస్టు చేసినప్పుడు బాండ్ హియరింగ్‌ను హోంలాండ్ భద్రతాధికారులు నిరాకరిస్తు న్నారు. దీనిపై అనేక కోర్టులు అధికారులకు వ్యతిరేకంగా తీర్పు లిస్తున్నాయి. కానీ ఇది రాజ్యాంగం, ఫెడరల్ వలస చట్టాలకు అనుగుణంగానే ఉందని 5వ సర్క్యూట్ కోర్టు ధర్మాసనం శుక్రవారం సాయంత్రం తీర్పు చెప్పింది. ధర్మాసనం తరపున 2-1 మెజారిటీతో జడ్జి ఎడిత్ హెచ్ జోన్స్ తీర్పు రాశారు. వలస, జాతీయ చట్టాలకు ప్రభుత్వం




సరిగానే అర్థం చెప్పిందని అభిప్రా యపడ్డారు. అనుమతిలేని విదేశీయులు దేశంలో ఎక్కడ పట్టుబడినా బాండ్‌పై విడుదలకు అనర్హులని స్పష్టం చేశారు. వారు ఎంతకాలం దేశంలో ఉన్నారన్నదీ అప్రస్తుతమని పేర్కొ న్నారు. గతంలో విదేశీయులు సరిహద్దుల్లో అరెస్టయితే..వారికి ఎటువంటి నేర చరిత్రా లేకపోతే వలసదారుల కోర్టులో బాండ్ హియరింగ్‌ను కోరేవారు. కోర్టులూ వారికి బాండ్లను మంజూరు చేసేవి. మెక్సికోకు చెందిన ఇద్దరు వలసదారులు అమెరికాలో పదేళ్లుగా ఉంటున్నారు. గత ఏడాది వారు తమను నెలలపాటు నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్లు వేశారు. వారికి గత అక్టోబరులో టెక్సాస్ కోర్టు బాండ్లు మంజూరు చేసిం ది. గత జూలైలో ట్రంప్ యంత్రాంగం బాండ్ల విధానాన్ని తిరగ దోడింది. తాజాగా అప్పీల్స్ కోర్టు ఆ విధానాన్ని సమర్థించడంతో ట్రంపనకు భారీ విజయం దక్కినట్లైంది.

## తకాయిచి కూటమి విజయం



టోక్యో: జపాన్ పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రధానమంత్రి సనాయీ తకాయిచి నేతృత్వంలోని సంకీర్ణ కూటమి అఖండ విజయం సాధించింది. మొత్తం 465 సీట్లున్న దిగువ సభకు ఆదివారం ఎన్నికలు జరగ్గా.. అధికార కూటమి మూడింట రెండొంతులకు పైగా స్థానాలను దక్కించుకుంది. ఇప్పటివరకూ అందిన వివరాల ప్రకారం- తకాయిచికి చెందిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్డీపీ) 316 సీట్లలో విజయ దుందుభి మోగించింది. దీంతో దిగువ సభలో సొంతంగా పూర్తి మెజార్టీని అది దక్కించుకున్నట్లయింది. జపాన్ తొలి మహిళా ప్రధాన మంత్రి తకాయిచి. గత అక్టోబరులోనే ఆమె ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

## ఎప్‌స్టీన్ మరణ ప్రకటన ముందే తయారుచేశారా?



ఎప్ స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి ఎప్ స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మాన్హాట్టన్ జైల్లో మృతిచెందాడు. అయితే అతడి మరణ ప్రకటన ఒకరోజు ముందే తయారు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ఆ తేదీ ఆగస్టు తొమ్మిదిగా ఉండటం సంచలనంగా మారింది. ఎప్‌స్టీన్ తన జైలు గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అప్ప ట్లో అధికారులు ధ్రువీకరించారు. అయితే అతడి మరణంపై అప్పటినుంచే అనుమానాలు ఉన్నాయి. ఆగస్టు 9 -రాత్రి 10.30 గంటల సమయంలో ఆరెంజ్ రంగు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి ఎపిస్టీన్ జైలు గదివైపు కదులుతున్నట్టుగా కొన్ని సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా విడుదలైన రికార్డుల్లో ఆ కదులుతున్న వ్యక్తిని ఖైదీకావొచ్చని పేర్కొనగా.. న్యాయశాఖ మాత్రం అతడు జైలు అధికారి అని చెప్తోంది. కాగా.. ఎపిన్ చనిపోయాడని గుర్తించిన తర్వాత తీసిన ఫొటోలను తాజాగా బహిర్గతం చేశారు. ఎప్‌స్టీన్ మరణించాడని గుర్తించిన 16 నిమిషాల తర్వాత స్ట్రెచర్పై ఉన్న అతడిని బతికించేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నట్టుగా ఓ చిత్రంలో కనిపించింది. ఆసుపత్రిలో అతడి మృతి ధ్రువీకరించిన తర్వాత తీసిన ఫొటోల్లో పేరును తప్పుగా రాయడం అనుమానాలకు తావిస్తోంది.

## ఆత్మాహుతి దాడికి భారత్ నిధులు

### - పాక్ మంత్రి ఆరోపణలు

ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి నెపాన్ని భారత్‌పై నెట్టేం దుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉంది. ఇస్లామాబాద్‌లోని షియా ముస్లింలకు చెందిన ఖదీజతుల్ కుబ్రా మసీదు, ఇమాంబర్గా (అషూర్‌ఖానా)లో గుర్తు తెలియని ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చేసుకోవటంతో 69 మంది మరణించారు. 169 మంది గాయపడ్డారు. ఈ దాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. అయినప్పటికీ పాక్ నేతలు మాత్రం భారత్‌పై ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. తాజాగా పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహసిన్ నఖ్వీ భారత్‌ను నింది స్తూ ఆరోపణలు చేశారు. తమ దేశంలోని ఉగ్ర సంస్థలకు భారత్ నిధులందిస్తోందని అన్నారు. తాజా దాడిలో ఐసిస్, తాలిబన్ల పేర్లు బయటకు వచ్చాయని, వారికి భారత్ నుంచే నిధులు, లక్ష్యాలు వస్తున్నాయని ఆరోపించారు. మొదట్లో ఒక్కో ఉగ్రవాదికి 500 డాలర్లు వచ్చేవని, ప్రస్తుతం 1500 డాలర్లు అందుతున్నాయని అన్నారు. వారి బడ్జెట్‌ను ఎవరో పెంచుతున్నారని అన్నారు. తాజా దాడిలో అఫ్గాన్ పౌరుడే ప్రధాన సూత్రధారి అని, అతడిని అరెస్ట్ చేశామని నఖ్వీ తెలిపారు. ఈ దాడికి బాధ్యత వహిస్తూ వెంటనే ఎవరూ ప్రకటన చేయలేదు. అయితే ఇది తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) పని అయి ఉండొచ్చని పోలీస్ వర్గాలు తెలిపా యి. దాడికి పాల్పడిన వ్యక్తి పాకిస్థాన్ పౌరుడు కాదని పేర్కొన్నా యి. రెండు రోజుల పర్యటన కోసం పాకిస్థాన్‌కు వచ్చిన ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఇస్లామాబాద్‌లో ఉండగానే ఈ దాడి జరగటం సంచలనం సృష్టించింది. ఈ దాడిని భారత్ ఖండించింది.

## గల్వాన్ తర్వాత
## చైనా రహస్య అణుపరీక్షలు!




వాషింగ్టన్: భారత్-చైనా సరిహద్దుల్లోని గల్వాన్‌లో ఘర్షణ జరిగిన కొద్దిరోజుల్లోనే చైనా రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిం చినట్టు అమెరికా తెలిపింది. దీనిని ఎవరూ గుర్తించకుండా ఉండేం దుకు 'డీకప్లింగ్' విధానం అనుసరించినట్టు అమెరికా అధికారి (అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్) థామస్ జీ డినానో ఆరోపించడం సంచలనం సృష్టించింది. 2020, జూన్ 22న చైనా ఈల్డ్-ప్రొడ్యూ సింగ్ అణుపరీక్షలు చేపట్టిందని థామస్ తెలిపారు. దీనిలో వందల టన్నుల పదార్థాలను వినియోగించిందన్నారు. అంతర్జాతీ య సమాజం దీనిని గుర్తించకుండా ఉండేలా పలు విధానాలను కూడా అనుసరించినట్టు పేర్కొన్నారు. "డీకప్లింగ్ విధానం వల్ల భూకంప పర్యవేక్షణ ప్రభావం తగ్గి.. ఇతరులు గుర్తించడం కష్టమ వుతుంది" అని థామస్ తన సోషల్ మీడియాలో వివరించారు.

## బంగ్లా జైలులో మాజీ ఎంపీ మృతి



ఢాకా: బంగ్లాదేశ్‌లోని దినాజ్పూర సెంట్రల్ జైలులో అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ చంద్రసేన్ (85) మృతిచెందా రు. ఐదు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన సేన్.. 2024 ఆగస్టు 16 నుంచి జైలులోనే ఉన్నారు. షేక్ హసీ నా ప్రభుత్వం రద్దయిన వెంటనే ఆయనపై జమాత్-ఎ-ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. హత్య సహా పలు నేరాలను ఆయనపై మోపి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఎలాంటి విచారణ లేకుండా కటకటాలకే పరిమితమయ్యారు. ఇటీవల జైలులో సేన్ ఆరోగ్యం క్షీణించింది. సరైన వైద్యం ఆయనకు అందలేదు. దీంతో జైలులోనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సేన్ మృతి కలకలం సృష్టిస్తోంది. అవామీ లీగ్ పార్టీలో రమేశ్ క్రియాశీలంగా ఉండేవారు. షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చేశాక అవామీ లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వం నడుపుతున్న మహమ్మద్ యూనస్ సలహామండలికి లక్ష్యంగా మారారు. ఒక్క 2025 సంవత్సరంలోనే బంగ్లాదేశ్ జైళ్లలో దాదాపు 107 మంది చనిపోయారని, ఇందులో ఎక్కువ మంది అవామీ లీగ్ పార్టీ నేతలేనని ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొంది.

# ఇటలీపై స్కాట్లాండ్ విజయం

## - 73 పరుగుల తేడాతో తొలి గెలుపు నమోదు

- 134 పరుగుల ఇటలీ ఆలౌట్
- బౌలింగ్‌లోనూ చెలరేగిన మైఖేల్ లీస్క్ - 4/17
- ఇటలీ కెప్టెన్ వేన్ మాడ్సెన్‌కు తీవ్ర గాయం




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో స్కాట్లాండ్ జట్టు తన తొలి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. గ్రూప్-సీ పోరులో భాగంగా కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో పసికూన ఇటలీపై 73 పరుగుల తేడాతో విజయం సాధించి తన శక్తిని చాటుకుంది. వెస్టిండీస్‌తో తొలి మ్యాచ్‌లో ఓడిన స్కాట్లాండ్ ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ సమష్టి ప్రదర్శన కనబరిచి కీలక విజయం అందుకుంది. ముఖ్యంగా ఆల్‌రౌండర్ మైఖేల్ లీస్క్ అద్భుత ఆటతో మ్యాచ్ ఫలితాన్ని పూర్తిగా తనవైపు తిప్పాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 207 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఓపెనర్ జార్జ్ మున్సే శతకం అంచుల దాకా వెళ్లి 54 బంతుల్లో 13 ఫోర్లు, రెండు సిక్సులతో 84 పరుగులు చేసి అవుటయ్యాడు. చివరి ఓవర్లలో బ్రాండన్ మెక్‌ముల్లెన్ 18 బంతుల్లో నాలుగు సిక్సులతో 41 పరుగులు చేయగా, మైఖేల్ లీస్క్ కేవలం ఐదు బంతుల్లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సులతో 22 పరుగులు చేయడం మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టేవర్ట్, జేజే స్మట్స్ తలో వికెట్ తీశారు.

భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఇటలీ బ్యాట్స్‌మెన్ స్కాట్లాండ్ బౌలింగ్ ముందు తేలిపోయారు. 16.4 ఓవర్లలోనే 134 పరుగులకు ఆలౌటయ్యారు. బెన్ మానెంటీ 31 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సుతో 52 పరుగులు చేసి కొంత పోరాడగా, హ్యారీ మానెంటీ 37 పరుగులతో సహకరించాడు. అయితే ఇతర బ్యాట్స్‌మెన్ నిలదొక్కుకోలేక పోయారు. స్కాట్లాండ్ బౌలింగ్‌లో మైఖేల్ లీస్క్ నాలుగు ఓవర్లలో 17 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసి మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. మార్క్ వాట్ రెండు వికెట్లు పడగొట్టగా, బ్రాడ్ కర్రీ, ఒలివర్ డేవిడ్సన్, బ్రాడ్ వీల్ తలో వికెట్ తీశారు.

ఈ మ్యాచ్‌లో ఇటలీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ తొలి టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లోనే కెప్టెన్ వేన్ మాడ్సెన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్కాట్లాండ్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో జార్జ్ మున్సే కొట్టిన షాట్‌ను మిడ్ వికెట్ వద్ద అడ్డుకునే ప్రయత్నంలో మాడ్సెన్ డైవ్ చేయగా, అతని ఎడమ భుజం నేలకు బలంగా తగిలి డిస్‌లోకేట్ అయ్యింది. తీవ్ర నొప్పితో మైదానం విడిచిన అతడు ఆ తర్వాత ఫీల్డింగ్‌కే కాదు, బ్యాటింగ్‌కూ అందుబాటులో లేకపోయాడు.

2006లో సౌతాఫ్రికా తరఫున హాకీ ప్రపంచకప్ ఆడిన వేన్ మాడ్సెన్, ఇప్పుడు క్రికెట్ ప్రపంచకప్‌లో ఇటలీ జట్టుకు నాయకత్వం వహిస్తూ అరంగేట్రం చేశాడు. అలాంటి క్రీడాకారుడు తొలి మ్యాచ్‌లోనే ఇలాంటి గాయానికి గురికావడం క్రీడాభిమానులను కలచివేస్తోంది. ఇటలీకి ఇది ఓటమికంటే పెద్ద నష్టం కాగా, స్కాట్లాండ్ మాత్రం ఈ విజయంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది.

# కేఎల్ రాహుల్ సునామీ

## ముంబైను చిత్తుచేసి సెమీస్‌లోకి కర్నాటక !



కేవలం భారత జట్టుకు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా తన ఆపద్బాదవంతమైన ఫార్మ్‌ను చాటుకున్నాడు కేఎల్ రాహుల్. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో అతను శతకంతో ముంబై బౌలర్లను చిత్తచేసి కర్నాటకను సెమీస్‌లోకి నెగ్గించాడు. 325 పరుగుల ఛేదనలో రాహుల్ చూపిన అద్భుత బ్యాటింగ్, మ్యాచ్‌ను కర్నాటకవేనుగా మార్చింది. 42 సార్లు ఛాంపియన్ అయిన ముంబైని 11 ఏళ్ల తర్వాత టైటిల్ దాడికి అడుగు ముందుకు పెట్టింది కర్నాటక.

ఎంసీఎ బీకేసీ మైదానంలో నాలుగో రోజున ముంబై నిర్దేశించిన భారీ టార్గెట్‌పై మయాంక్ అగర్వాల్ (3) విఫలమైనప్పటికీ, కర్నాటకలో అందరూ రాహుల్‌పై నమ్మకం ఉంచారు. శార్దూల్ ఠాకూర్, తుషార్ పాండే వంటి బౌలర్లను ఆడవేయడం ద్వారా రాహుల్(130) కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్(39)తో అద్భుతమైన అర్ధశతక భాగస్వామ్యం ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత స్మరన్ రవిచంద్రన్ (83లి)తో విలువైన రన్స్ జోడించి 147 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసి, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన 24వ సెంచరీని నమోదు చేశాడు.

రాహుల్ ఆధ్వర్యంలో కర్నాటక నాలుగు వికెట్ల తేడాతో ముంబైని సరిగా చిత్తుచేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ముంబై 53 పరుగుల ఆధిక్యం సృష్టించినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో క్రీడాకారులు పూర్తి చాంపియన్ మైనట్లు ఆడారు. వికెట్ కీపర్ ఆకాశ్ ఆనంద్ (70) హాఫ్ సెంచరీతో మెరుచుతూ, చివరి క్షణాల్లో తనుష్ కొతియాన్ (48లి) మరియు తుషార్ దేశ్‌పాండే (47) కర్నాటక బౌలర్లను బలంగా ఎదుర్కొన్నారు. వీరి పట్టుదల కాబట్టి ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 375 పరుగులు చేసి కర్నాటకకు భారీ లక్ష్యాన్ని సృష్టించింది.

కేఎల్ రాహుల్ రంజీ ట్రోఫీపై చూపిన ఆటకు రాష్ట్రం గర్వపడేలా చేసింది, అలాగే సెమీస్‌లో కర్నాటక విజయం సాధించడం కోసం బలమైన నిబంధనలను ఏర్పాటు చేసింది.




# దక్షిణాఫ్రికా శుభారంభం

## కెనడాపై ఘన విజయం

అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసింది. అహ్మదాబాద్ వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఓపెనర్ మార్క్రమ్ (59) అర్ధశతకం చేశాడు. డికాక్ (25), రికెల్టన్ (33), డేవిడ్ మిల్లర్ (39), స్టబ్స్ (34) రాణించారు. కెనడా బౌలర్లలో కలీమ్ సనా 2 వికెట్లు పడగొట్టగా బజ్వా ఒక వికెట్ తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన కెనడా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులకు పరిమిత మైంది. నవ్నీత్ ధలివాల్ (64) ఒంటరి పోరాటం చేశాడు. హర్ష్ థాకెర్ (33) మినహా మిగతా వారెవ్వరూ రాణించలేదు. దక్షిణా ఫ్రికా బౌలర్లలో ఎంగిడి 4 వికెట్లు పడగొట్టగా.. మార్కో జాన్సన్ 2, రబాడ, కార్బిన్ బోచ్ ఒక్కో వికెట్ తీశారు.

# ఒమన్‌పై జింబాబ్వే విజయం

కొలంబో: టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా కొలంబోలో జింబాబ్వే, ఒమన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఒమన్.. 19.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. వినాయక్ శుక్లా (28) టాప్ స్కోరర్. టాప్-5 బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదు. అమీర్ కలీం (5), జతీందర్ సింగ్ (5), హమ్మద్ మీర్జా (0), కరణ్ సోనావాలే (0), వసీమ్ అలీ (3) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. దీంతో జింబాబ్వే 27 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో వినాయక్ శుక్లా, సుఫ్యాన్ మెహమూద్ (25) ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెల కొల్పారు. తొమ్మిదో స్థానంలో వచ్చిన నదీమ్ ఖాన్ (20) పరుగు లు చేశాడు. జింబాబ్వే బౌలర్లలో ముజారబానీ (3/16), రిచర్డ్ నగరవ (3/10), బ్రాడ్ ఎవాన్స్ (3/18) సత్తా చాటారు. అనంత రం బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బెన్నెట్(48), బ్రెండన్ టేలర్(31) రాణించారు.



# భారత్-పాక్ హై వోల్టేజ్ మ్యాచ్

- పాకిస్థాన్ వెనక్కి..
- బంగ్లాదేశ్ అంశమే కారణమా?
- 'అన్యాయం జరిగింది' అంటూ పాకిస్థాన్ నిరసన
- మ్యాచ్ జరగాలంటే మూడు డిమాండ్లు
- ఐసీసీ ముందు పీసీబీ షరతులు




*ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా జరగాల్సిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం కొలంబో వేదికగా ఈ హై వోల్టేజ్ మ్యాచ్ నిర్వహించాల్సి ఉండగా, పాకిస్థాన్ ప్రభుత్వం భారత్‌తో మ్యాచ్ ఆడబోమని ప్రకటించడంతో పరిస్థితి సంక్లిష్టంగా మారింది. బంగ్లాదేశ్ జట్టుకు ఐసీసీ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ, ఆ దేశానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ ప్రభుత్వ అనుమతి లేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఐసీసీకి అధికారికంగా తెలియజేసింది.*

*భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు సుమారు రూ.4500 కోట్ల వ్యాపార విలువ ఉండటంతో, ఈ మ్యాచ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనైనా నిర్వహించాలనే పట్టుదలతో ఐసీసీ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో లాహోర్‌లో పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం కీలక సమావేశం నిర్వహించారు. ఐదు గంటలకు పైగా సాగిన ఈ చర్చల్లో పీసీబీ మూడు డిమాండ్లను ఐసీసీ ముందుంచినట్లు సమాచారం. బంగ్లాదేశ్ క్రికెట్ అభివృద్ధికి అదనపు నిధులు, టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనకపోయినా బంగ్లాదేశ్‌కు పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం, భవిష్యత్‌లో ఆ దేశానికి ఐసీసీ ఈవెంట్ల ఆతిథ్య హక్కులు కల్పించాలన్నవే ఈ డిమాండ్లు.*

*ఈ పరిణామాల మధ్య భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్‌కు ఐసీసీ 24 గంటల డెడ్‌లైన్ విధించినట్లు సమాచారం. చర్చల సారాంశాన్ని పీసీబీ ఛైర్మన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు వివరించనున్నారని, తుది నిర్ణయం ప్రధాని సూచనల మేరకే తీసుకుంటామని పాకిస్థాన్ మీడియా పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌తో మ్యాచ్ ఆడే అంశంపై పీసీబీ లోపలే రెండు వర్గాలు ఏర్పడ్డాయని సమాచారం. ఒక వర్గం మ్యాచ్ ఆడాలని అభిప్రాయపడుతుండగా, మరో వర్గం ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని వాదిస్తోంది.*

*ఈ వివాదంపై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శు క్లా స్పందిస్తూ, ఐసీసీ తీసుకునే ఏ నిర్ణయానికైనా బీసీసీఐ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ తరఫున ప్రత్యేక వ్యాఖ్యలు ఉండవని తెలిపారు. మరోవైపు పాకిస్థాన్ చివరి నిమిషంలో వైఖరి మార్చుకొని భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు సుముఖత వ్యక్తం చేస్తుందని ఐసీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.*

*ఈ వివాదానికి మూలకారణం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తే అని తెలుస్తోంది. భద్రతా కారణాలతో భారత్‌లో ఆడలేమని, తమ ప్రపంచకప్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ చేసిన అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. ఆటగాళ్ల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని హామీ ఇచ్చినా బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకోవడంతో, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టిన పీసీబీ, భారత్‌కు ఒక న్యాయం, బంగ్లాదేశ్‌కు మరో న్యాయమా అంటూ ప్రశ్నిస్తూ, ఐసీసీ టీ20 ప్రపంచకప్ మొత్తానికి దూరంగా ఉంటామని హెచ్చరించింది. చివరకు భారత్‌తో మ్యాచ్‌ను మాత్రమే ఆడబోమని ప్రకటిస్తూ తన నిరసనను తెలియజేస్తోంది.*

చైతన్య రథం సినిమా
మంగళవారం 10 ఫిబ్రవరి 2026 IX

## కిరణ్ అబ్బవరం, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా కాంబినేషన్‌లో

# భారీ బడ్జెట్ సినిమా



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా (Ess Kay Gee Entertainment), జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో చేతులు కలిపారు. వీరు కిరణ్ హీరోగా ఓ భారీ 'పాన్-ఇండియా' సినిమాను నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఒక అద్భుతమైన 'మైథాలజీ యాక్షన్ ఎంటర్‌టైనర్'గా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వరల్డ్ క్లాస్ 'విజువల్స్', హై టెక్నికల్ వాల్యూస్‌తో సినిమాను నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్‌ను వచ్చే సెప్టెంబరు నెలలో ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

హీరోయిన్ ఎంపిక విషయంలోనూ చిత్ర బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. సినిమా టైటిల్, డైరెక్టర్, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే అధికారికంగా అనౌన్స్ చేయనున్నారు. భక్తి, ఎమోషన్స్, డ్రామా, హై-వోల్టేజ్ యాక్షన్ కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం... అన్ని వర్గాల ఆడియన్స్‌ను కచ్చితంగా ఆకట్టుకుంటుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు.

# క్రిస్పీ రన్ టైమ్‌తో వస్తున్న 'ఫంకీ'..

## విశ్వక్ ఈసారి కొట్టేస్తాడా..?



మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా, 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త కామెడీ ఎంటర్టైనర్ 'ఫంకీ'. వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న విడుదల కాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ అనుదీప్ మార్క్ సెటైరికల్ కామెడీతో ఆకట్టుకోగా, సినిమాలో విశ్వక్‌సేన్ ఒక సినీ దర్శకుడిగా, కయాదు లోహర్ నిర్మాతగా కనిపించనున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీతోపాటు సినిమా ఇండస్ట్రీపై సాగే వ్యంగ్యాస్త్రాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

ఈ సినిమా సుమారు 130 నిమిషాల (2గంటల 10నిమిషాలు) నిడివితో చాలా క్రిస్పీగా ఉండబోతోంది. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం బ్రేక్ ఈవెన్ సాధించాలంటే సుమారు రూ.15కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.30కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టాలి. ప్రస్తుతం థియేటర్లలో పెద్దగా పోటీ లేకపోవడం, పాజిటివ్ టాక్ వస్తే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సులభమేనని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఇప్పటికే యూత్‌ని ఆకట్టుకుంటోంది.


సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ, ఒక దర్శకుడు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం చేసే పోరాటాన్ని వినోదాత్మకంగా చూపిస్తుంది. వాలంటైన్స్ డే వీకెండ్‌లో యువతకు, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఒక ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్‌గా 'ఫంకీ' నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. సీనియర్ నరేష్, వీటీవీ గణేష్ వంటి నటుల కామెడీ టైమింగ్ ఈ సినిమాకు అదనపు బలాన్ని ఇవ్వనుంది.

# 'ఓటీటీ': ఈ వారం అలరించే క్రేజీ సిరీస్‌లు, థ్రిల్లింగ్ చిత్రాలివే!












ఈ వారం కూడా ఓటీటీల్లో చాలా చిత్రాలు స్ట్రీమింగ్ అయ్యాయి. థియేటర్స్‌లో ప్రతి వారం వరుసగా సినిమాలు రిలీజ్ అవుతున్నా.. ఓటీటీలపై ప్రేక్షకులు బాగా ఆసక్తి చూపిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ప్రేక్షకులను అలరించడానికి ఎప్పటికప్పుడు కొత్త కంటెంట్‌తో వినూత్న చిత్రాలతో, వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. మరి ఈ వీక్ సందడి చేసే పలుచిత్రాలపై ఓ లుక్కేద్దాం.

ఈ వారం ఓటీటీలో రిలీజ్ అయ్యే చిత్రాలు, వెబ్ సిరీస్ లు ఇవే.

**నెట్‌ఫ్లిక్స్:**
క్యాష్ క్వీన్స్ (వెబ్‌సిరీస్) - ఇంగ్లీష్
ది లింకన్ లాయర్ 4 (వెబ్‌సిరీస్) - ఇంగ్లీష్
సాల్వడర్ (వెబ్‌సిరీస్) - ఇంగ్లీష్

**అమెజాన్ ప్రైమ్:**
రిలేషన్‌షిప్ గోల్స్ (మూవీ) - ఇంగ్లీష్
ఫైండింగ్ హార్మోనీ (మూవీ) ఇంగ్లీష్
ఎల్‌వోఎల్ (వెబ్‌సిరీస్) - ఇంగ్లీష్
తు మేరీ మై తేరా... మై తేరా తు మేరీ (మూవీ-రెంట్) హిందీ

**జియో హాట్‌స్టార్:** ది ఫిఫ్టీ (రియాల్టీ షో)

**జీ5:**
షబద్ రీత్ ఔర్ రివాజ్ (వెబ్‌సిరీస్) - హిందీ

**సోనీలివ్:** జాజ్ సిటీ (వెబ్‌సిరీస్) - హిందీ

**సన్ నెక్ట్స్:** నీలకంఠం (మూవీ) తెలుగు

# ఇన్విటేషన్ వస్తే చూద్దాం...

విజయ్ దేవరకొండ పెళ్లిపై ప్రశ్న ఎదురవగా దర్శక, నటుడు తరుణ్ భాస్కర్ స్పందించారు. 'త్వరలో విజయ్ వివాహం అని తెలిసింది. మీరు వెళుతున్నారా?' అని అడగ్గా.. "నాకు ఆహ్వానం అందలేదు. ఒకవేళ ఇన్విటేషన్ వస్తే మీకు వాట్సాప్లో ఫార్వాడ్ చేస్తా. కలిసి వెళదాం" అని సమాధానమిచ్చారు. తన కొత్త సినిమా 'గాయపడ్డ సింహం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో ఆయన సందడి చేశారు. ఈ నెల 26న విజయ్ - రష్మిక వివాహం చేసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తరుణ్ను ప్రశ్నించారు. విజయ్-తరుణ్ స్నేహితులన్న సంగతి తెలిసిందే. విజయ్ హీరోగా తరుణ్ తెరకెక్కించిన



'పెళ్లిచూపులు' (2016) బాక్సాఫీసు వద్ద హిట్గా నిలవడమే కాదా జాతీయ అవార్డునూ దక్కించుకుంది.

### తదుపరి ప్రాజెక్టులు


"హీరోగా మూడు ప్రాజెక్టులు అంగీకరించా. వాటిలోని 'ఓం శాంతి శాంతి శాంతిః' ఇటీవల విడుదలైంది. రెండో సినిమా ఇదే (గాయపడ్డ సింహం). మరో సినిమా రాబోతోంది. దర్శకుడిగా ప్రస్తుతం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ తెరకెక్కిస్తున్నా. అక్టోబరు/ నవంబరులో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఓటీటీ సంస్థ కోసం ఓ ప్రాజెక్టు చేస్తున్నా. వెంకటేష్‌తో చేయాలనుకున్న మూవీ స్క్రిప్టు దశలో ఉంది. వేరే కథ ఒకటి రాస్తున్నా" అని తెలిపారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన 'గాయపడ్డ సింహం'లో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. ఈ వినోదాత్మక చిత్రం త్వరలో విడుదల కానుంది.

# 'పెద్ది' సెకండ్ సింగిల్.. క్లూ ఇచ్చిన బుచ్చిబాబు!

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్"చికిరి చికిరి" ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయగా... ఇప్పుడు అందరి దృష్టి సెకండ్ సింగిల్‌పై పడింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈచిత్రం నుంచి రాబోయే రెండో పాట ఒక పవర్ ఫుల్ 'ఇంట్రడక్షన్ సాంగ్' అని... దీనికి జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులను కంపోజ్ చేశారని సమాచారం.

దర్శకుడు బుచ్చిబాబు ఈ పాట గురించి సోషల్ మీడియాలో స్పందిస్తూ... ఇది కచ్చితంగా ఒక "బ్లాస్ట్"లా ఉంటుందని అభిమానులకు ప్రామిస్ చేశారు. నిజానికి ఈపాట డిసెంబరునెలాఖరులోనే రావాల్సి ఉన్నప్పటికీ ఫిబ్రవరి 14న విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. దీనికి సంబం ధించిన అధికారిక ప్రకటన ఈ వారం లోనే వచ్చే అవకాశం ఉండటంతో మెగా అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా... శివ రాజ్‌కుమార్,



జగపతిబాబు, దివ్యేందు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం 2026 ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'స్పిరిట్' నుంచి 'ఓజీ' నటుడు బయటకి? నిజమేనా!




ప్రస్తుతం ఇండియన్ సినిమా నుంచి తెరకెక్కుతున్న భారీ చిత్రాల్లో ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్ ప్రభాస్ హీరోగా కల్ట్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కలయికలో చేస్తున్న సినిమా 'స్పిరిట్' కూడా ఒకటి. ఈ సినిమా షూటింగ్ ఇటీవల మొదలైన సంగతి తెలిసిందే. ప్రభాస్ సహా విలక్షణ నటుడు ప్రకాష్‌రాజ్ నడుమ సన్నివేశాలతో షూట్ మొదలైనట్టు టాక్ వచ్చింది.

అయితే ఈ సినిమా నుంచి ప్రకాష్‌రాజ్ తప్పుకున్నట్టు కొన్ని రూమర్స్ ఇప్పుడు స్ప్రెడ్ అవుతున్నాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియాల్సి ఉంది. ఈ సినిమాలో ప్రకాష్‌రాజ్ ది ఎంత కీలక పాత్ర అనేది వాయిస్ టీజర్‌తోనే చాలా మందికి అర్థమైంది. అలాంటిది తన రోల్ ఉండదు అనే టాక్ ఏ మేరకు నిజం అనేది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తుండగా భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.